Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 50 | కరీంనగర్ | మంగళవారం 14 జులై 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## జాడలేని వర్షాలు...ముఖం చాటేసిన మబ్బులు

### మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై13 :తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు 3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా

11 లో

## ఉరేసుకుని మహిళా సర్పంచ్ ఆత్మహత్య

నిర్మల్,జూలై13 : నిర్మల్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. తానూరు మండలం బోరిగావ్ గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సర్పంచ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులా? కుటుంబ కలహాలా? మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.







### కేంద్ర సహకారంతోనే

# అభివృద్ధి సాధ్యం

- పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి
- మెట్రో, ట్రిపుల్ ఆర్ తదతిర అంశాలపై అనుమతులు రాబట్టాలి
- ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు
- సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జులై 13 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు.

11 లో

### సింగరేణిని భ్రష్టు పట్టించిన

# బిఆర్ఎస్, కాంగ్రెస్



- గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు
- అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది
- సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 13 :సింగరేణిలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని స్పష్టం చేసిందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక్ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో

11 లో

## నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా పెంజర్ల పొలాల్లో మృతదేహం
- స్థానికుల సమాచారంతో రాజ్‌కుమార్ గుర్తింపు
- మృతదేహం పక్న పాయిజన్ బాటిల్ లభ్యం
- శవం పక్కనే ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హత్యకు ముందు వీడియో కాల్ రికార్డు చేసిన హంతకుడు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రంగారెడ్డి,జూలై13 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధారించారు. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి

11 లో

### సర్పంచ్ కుటుంబానికి

## కెటిఆర్ పరామర్శ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల,జూలై13 :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి సర్పంచ్ మాశెట్టి లచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించారు. లచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లచ్చయ్య అకాల మరణం బాధాకరమని కేటీఆర్ అన్నారు. ఆయన మృతి తీరని లోటు అని పేర్కొన్నారు. లచ్చయ్య కుటుంబసభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కాగా, కేటీఆర్ వెంట న్యాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు , పార్టీ, గ్రామ నేతలు ఉన్నారు

### స్వలాభం కోసం

## కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు

- ఎన్టీఆర్ ప్రాపకం కోసమే కొడుక్కు తారకరామారావు పేరు
- భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపాటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్,జూలై13 : కెసిఆర్ రాజకీయ జీవితమంతా పాప పంకిలమేనని, అవసరానికి తగ్గట్లుగా ఊసరవెల్లి తీరులో నడిచిన ఘనుడని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టికెట్ కోసం కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్ ది అంటూ వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌ను కాకా పట్టేందుకు కొడుకు పేరును తారకా రామారావు అని పెట్టుకున్నాడని అన్నారు. మంత్రి పదవి రాలేదనే కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చారన్నారు. చంద్రబాబు కూడా మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టారని అన్నారుపార్టీ పెట్టి ఎలక్షన్లు,

11 లో

## సింగరేణి అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం

- సింగరేణి యాజమాన్యానికి భట్టి విక్రమార్క ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జులై13 :సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ అమలుకు సంబంధించి అధికార సంఘం


11 లో



## విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

- యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి
- ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సిఎం రేవంత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్,జులై13 : జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వ్యాఖ్యానించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే

11 లో

## సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

- బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులదడక
- గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు
- మరోమారు మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సంగారెడ్డి, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబు కి గురు ప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని

11 లో






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జులై13 : ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా

11 లో

### ఎల్-నినో సవాళ్లను

## ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

- మూడు దశల ముందస్తు కార్యాచరణ
- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమీక్ష
- వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై బులెటిన్ విడుదల
- 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు

## టీజీటెట్-జూన్ 2026 ఫలితాల విడుదల

- ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్
- 21న విడుదల చేస్తామన్న విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జులై13:తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష టీజీటెట్-జూన్ 2026 ఫలితాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. జూన్ 16 నుంచి 22 వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో 10 సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,53,752

11 లో



(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, జూలై 13 : సింగరేణి సంస్థ భవిష్యత్తును కాపాడడం, సుమారు 40 వేల మంది కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా తాడిచర్ల–-2 బొగ్గు బ్లాక్‌ను వేలం ప్రక్రియకు వెళ్లకుండా నేరుగా సింగరేణికి కేటాయించినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా మార్చి దోపిడీ చేశాయని, సంస్థ అభివృద్ధిని విస్మరించి స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకున్నాయని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించిన ఆయన, సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టే విధానాలను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా బీజేపీ–బీఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల "సింగరేణి భరోసా యాత్ర"లో భాగంగా సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన హాల్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిలో అవినీతి, పైరవీకారుల వ్యవస్థ పెరిగిపోయిందని ఆరోపించారు. సంస్థ అభివృద్ధి కంటే ఆర్థిక ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తూ సంస్థను ఆర్థికంగా బలహీనపరుస్తోందని ఆరోపించారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ సంస్థకు సంబంధించిన కీలక నిర్ణయాల్లో కేంద్రాన్ని భాగస్వామిగా పరిగణించలేదని ఆయన అన్నారు. గతంలో సింగరేణి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంస్థను ఆదుకుందని గుర్తు చేశారు. అదే విధంగా

# సింగరేణిని కాపాడేందుకే తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయించాం

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి .
- సంస్థను కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నాయి.
- రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలి.
- 'సింగరేణి భరోసా యాత్ర'లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ఘాటు విమర్శలు.

ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను వేలం లేకుండానే కేటాయించిందని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధిగా తాను సింగరేణి సమస్యలను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లిన అనంతరం కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిందని తెలిపారు. ఈ బొగ్గు బ్లాక్‌తో సంస్థకు దీర్ఘకాలిక బొగ్గు నిల్వలు లభించడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యం పెరగడం, ఉద్యోగ భద్రత బలోపేతం కావడం, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల భవిష్యత్తు మరింత సురక్షితంగా మారుతుందని వివరించారు. దేశంలో ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొని కొత్త బ్లాకులు సాధించగా, గత ప్రభుత్వాలు సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యాయని కిషన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేసి సంస్థ ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సింగరేణిని మరింత బలోపేతం చేయడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సంస్థలో అవినీతికి, పైరవీకారులకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని హెచ్చరించారు. రానున్న రోజుల్లో సింగరేణిని నష్టాల బాటలో కాకుండా లాభాల బాటలో నడిపించి, దేశంలో అత్యుత్తమ ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా, నవరత్న స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాలమూరు ఎంపీ డీకే అరుణ, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, బీఎంఎస్ నాయకులు, సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, బీజేపీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం - సాగునీరు,తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం. - రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (కన్నాయిగూడెం) జులై 13 : దేవాదుల ప్రాజెక్ట్ ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు రైతులకు గోదావరి జలాలతో సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక,ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క అన్నారు.సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ.లెనిన్ వత్సల్ టోప్పో,డి ఎఫ్ ఓ వికాస్ మినా, పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో మంత్రులు కలిసి తుపాకులగూడెం సమ్మక్క సారలమ్మ బ్యారేజీ గోదావరి నది నీటి ప్రవాహాన్ని నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించి, తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం జె.చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్ ను,మోటార్ల పనితీరును,ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం ఉప ముఖ్యమంత్రి,బట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులు,భూ సేకరణ, ఎత్తిపోతల సామర్థ్యం,సాగు త్రాగునీరు,మోటార్ల పనితీరు పై పి పి టి ద్వారా ఇంజనీరింగ్ అధికారులు వివరించగా ఇట్టి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు,తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం దూరదృష్టితో కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎలా ఉండబోతోందో,దాని వల్ల వ్యవసాయం,తాగునీటి సరఫరా, జలవనరులపై కలిగే ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై లోతుగా చర్చించి ముందస్తు కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ఇస్తుందని,ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.దేవాదుల ప్రాజెక్టులో ఉన్న 10 పంపుల్లో 7 పంపులు పనిచేస్తున్నాయని, మరో ఒకటి రెండు రోజుల్లో అన్ని 10 పంపులను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలనిములుగు, వరంగల్ చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు.ప్రాజెక్టు పనులకు సంబంధించి రూ.194 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారని,ఆర్థిక శాఖ మంత్రి సహకారంతో రూ.194 కోట్ల నిధులను వెంటనే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 38.16 టీఎంసీలు అని పేర్కొంటూ,ఆ సామర్థ్యానికి అనుగుణంగా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టు రూపకల్పనలో ఉన్న మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజుపాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి,సంపత్ రావు,ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,ఇంజనీరింగ్ అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఉప ముఖ్యమంత్రి పర్యటన రద్దు

- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు
- సింగరేణి స్కామ్‌పై కేంద్రం విచారణ జరపాలి
- కాంగ్రెస్-బిజెపి మధ్య చీకటి ఒప్పందం ఉందని ఆరోపణ




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూలై 13 : భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా ప్రజలు, రైతాంగం తరపున బీఆర్ఎస్ సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన పర్యటనను రద్దు చేసుకున్నారని భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. సోమవారం మణుగూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా అభివృద్ధి, రైతాంగ సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు, సీతమ్మసాగర్ బ్యారేజీ పనులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులను రాజకీయ కారణాలతో నిలిపివేశారని విమర్శించారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జిల్లాకు కొత్తగా వచ్చిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసా, రుణమాఫీ, రైతుబీమా, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తలెత్తితే ప్రభుత్వం వద్ద కార్యాచరణ ప్రణాళిక ఏమిటో వెల్లడించాలని ప్రశ్నించారు. సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వలకు సంబంధించిన అక్రమాలు, ఆర్థిక అవకతవకలపై గతంలోనే ఆధారాలు బయటపెట్టామని, ఈ అంశంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని రేగా కాంతారావు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, లేదంటే కాంగ్రెస్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందం ఉందనే అనుమానాలు మరింత బలపడతాయని ఆరోపించారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం, మెడికల్ బోర్డులు నిర్వహించకపోవడం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఈ అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వైద్య సేవలు, రైతు సంక్షేమం, సంక్షేమ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు తమ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని, ప్రజా సమస్యలపై ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే మూల స్తంభాలు - జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూలై 13: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల రిసోర్స్ పర్సన్స్ కోసం నిర్వహిస్తున్న మూడు రోజుల జిల్లా స్థాయి సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం సోమవారం జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, ఆసిఫాబాద్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హరిత, ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు మూలస్తంభాలు అని విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ప్రాథమిక విద్య ప్రతి చిన్నారిలో చదవడం, రాయడం, గణించడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించే గొప్ప బాధ్యత ప్రాథమిక ఉపాధ్యాయులపై ఉంది అని అన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థి అభ్యసన ఫలితాలను మెరుగుపర్చేందుకు కృషి చేయాలని, ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు వినూత్న బోధనా పద్ధతులు, సమగ్ర బోధన, విద్యార్థి కేంద్రిత అభ్యాసం, అభ్యసన ఫలితాల మెరుగుదల వంటి అంశాలపై చర్చ జరగాలని, ఎం ఆర్ పి లకు దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమం జూలై 13 నుండి 15 వరకు కొనసాగనుండగా, జిల్లాలోని అన్ని మండలాల నుండి ఎంపికైన మండల రిసోర్స్ పర్సన్స్





పాల్గొంటున్నారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, బోధనను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యంగా జులై 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి,క్వాలిటీ కోఆర్డినేటర్, ఉప్పులేటి శ్రీనివాస్, కోర్స్ ఇన్చార్జి అడే ప్రకాష్ , జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లు, అన్ని మండలాల నుండి ఎంపికైన మండల రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల వినతి

**- కనీస పెన్షన్ రూ.15 వేలు, హెల్త్ ఇన్సూరెన్స్ రూ.25 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి–కొత్తగూడెం, జూలై 13 : సింగరేణి విశ్రాంత ఉద్యోగుల కనీస పెన్షన్‌ను నెలకు రూ.15 వేలుగా నిర్ణయించడంతో పాటు హెల్త్ ఇన్సూరెన్స్ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కోరారు. సింగరేణి భరోసా యాత్రలో భాగంగా సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం ప్రతినిధులు కేంద్ర మంత్రిని కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. సంఘం తరఫున కొల్లు నాగేశ్వరరావు, బీఎంఎస్ మాజీ అధ్యక్షుడు చింతల సూర్యనారాయణ, సింగరేణి విశ్రాంత అధికారి సామ్య తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల జీవన వ్యయం, వైద్య ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో కనీస పెన్షన్‌ను రూ.15 వేలకు పెంచాలని, ఆరోగ్య భద్రత దృష్ట్యా హెల్త్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె. అరుణ, భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు కూడా ఇదే అంశంపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు కోరుట్ల గురుమూర్తి, అంజనానందం, రాజేంద్ర ప్రసాద్, శివరామకృష్ణ, ఎస్. రామచంద్రరావు, ధర్మారావు, అక్కినేని మురలీకృష్ణ, విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్

**సర్టిఫికెట్లు, పతకాల ప్రదానం జిల్లా కలెక్టర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఆసిఫాబాద్, జూలై 13 : జిల్లాలో తైక్వాండో , కరాటే విభాగాల్లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సమావేశ మందిరంలో అవార్డులను విజేతలకు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణానికి చెందిన సెంట్ క్లారిటీ స్కూల్‌కు చెందిన కె. నవనీత్ చంద్ర, ఫాతిమా కాన్వెంట్ విద్యార్థులతో పాటు కట్కూరి శ్రీనాథ్ కే. అశ్విత్ యాదవ్ లు కలెక్టర్ కే. హరిత చేతుల మీదుగా తమ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను, మెడల్స్ ను అందుకున్నారు. తైక్వాండో, కరాటే రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి, జిల్లా పేరును ప్రపంచ వేదికపై నిలిపినందుకు గాను వీరిని ప్రత్యేకంగా సత్కరించారు. విద్యార్థులు సాధించిన ఈ అద్భుతమైన విజయంపై డీ వై ఎస్ ఒ ఆశఫాక్ హైమద్ ఖేలో ఇండియా కోచ్ కడతాల రాకేష్ ,జిల్లా సెక్రటరీ ఎం. దేవయ్య ,ప్రెసిడెంట్ వి. రవి లు స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, జూలై 13 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సిర్పూర్ – టి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన మంగెన భూదేవి తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహేగాం మండల కేంద్రానికి చెందిన భుతే దేవేందర్ తమ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేస్తారు. ఆసిఫాబాద్ మండలం కౌటగూడ గ్రామానికి చెందిన గెడం పద్మ తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం క్రింద ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ – టి మండల కేంద్రంలోని రైల్వే కాలనీకి చెందిన గాదె సుభద్ర తనకు గృహజ్యోతి పథకం క్రింద రాయితీ వర్తింపజేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన దుర్గం కావేరి తన పిల్లలకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీకి చెందిన చాపిడి సరోజ తనకు మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ గా ఉపాధి కల్పించాలని కోరుతూ ఆర్ జి సమర్పించారు. దహేగాం మండలం ఐనం గ్రామానికి చెందిన కొట్లూరి దుర్గా గౌడ్ తాను సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిని పట్టా చేసి పాసుపుస్తకం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అల్బెండొజాల్ మాత్రల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



లక్షెటిపేట, జులై 13 : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పదివేల ఐదు వందల మంది (10, 500) 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలను గుర్తించి 90 శాతం మంది పిల్లలకు సోమవారం అల్బెండొజాల్ మాత్రలను అందజేశామని, మిగిలిన వారికి ఈనెల 20 తారీకు నాడు మాప్ అప్ డే రోజు మాత్రలను అందజేసి వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని వెంకట్రావు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సమత తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి–నర్సయ్య చేతుల మీదుగా విద్యార్థులకు టాబ్లెట్స్ అందించి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతు ప్రతి ఆరు నెలలకు ఒకసారి అల్బెండొజాల్ మాత్రలను ప్రభుత్వం అందజేస్తుందని తప్పకుండా విద్యార్థులు ప్రతీ ఒక్కరు వీటిని తీసుకోవాలని అన్నారు. ఈ మాత్రలను తీసుకోవడం వల్ల విద్యార్థుల శారీరక,మానసిక ఆరోగ్యం మరింత మెరుగుపడి ఉన్నతంగా ఎదిగేందుకు తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, ఎంపిడీఓ మధుసుధన్, ఇంచార్జీ ఎంఈఓ శైలజ, హెచ్ఈఓ దేవేందర్, హెల్త్ సూపర్ వైజర్ శోభ, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, వేణు, ఇసాక్ అహ్మద్, ఏఎన్ఎం సుజాత, ఆశావర్కర్స్,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారముల ఆన్ లైన్ వెంట వెంటనే పూర్తి చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్,జులై 13 : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, సోమవారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీలో జరుగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. గడువులోగా ఎస్ఐఆర్ ఫారముల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ఫారంలను పూరించుటలో ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎస్ఐఆర్ విషయంలో సహాయం చేయాలన్నారు. సూపర్వైజర్లు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవీదాస్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల సమస్యల పరిష్కారానికి భట్టి గ్రీన్ సిగ్నల్



## - వేతన సవరణ, పీఆర్‌పీపై త్వరలో నిర్ణయం.
## - రెండు నుంచి మూడు నెలల్లో అధికార సంఘంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని యాజమాన్యానికి ఆదేశాలు.
## - సింగరేణిని అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దడంలో అధికారుల పాత్ర కీలకమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 13 : సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారుల వేతన సవరణ, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ (పీఆర్‌పీ) అమలుతో పాటు ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అధికారుల సమస్యలపై ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టి, రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికార సంఘంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని సోమవారం ఆదేశించారు. దీంతో గత కొంతకాలంగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళనలు కొనసాగిస్తున్న సింగరేణి అధికారుల్లో ఆశాభావం నెలకొంది. ఇటీవల ప్రజా ప్రభుత్వ చొరవతో సింగరేణికి అత్యంత కీలకమైన తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు లభించడంలో కీలక పాత్ర పోషించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సింగరేణి అధికార సంఘం నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అదే సందర్భంగా అధికారుల వేతన సవరణ, పీఆర్‌పీ అమలు, ఇతర సేవా సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ విజ్ఞప్తులపై వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థల్లో అమలులో ఉన్న విధానాలను పరిశీలించి, సింగరేణి అధికారుల వేతన సవరణ, పీఆర్‌పీ అంశాలపై ప్రాధాన్యంగా నిర్ణయం తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమని, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన ఇంధన భద్రత కల్పించడంలో కార్మికులు, అధికారులు సమష్టిగా విశేష కృషి చేస్తున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో అధికారుల్లో అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి పూర్తి భరోసా కల్పించాలని యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే మారుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, బొగ్గు రంగంలో పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, ఉత్పాదకత, విక్రయాల్లో సింగరేణి మరింత పోటీతత్వాన్ని సాధించాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్, సౌరశక్తి, బొగ్గు గ్యాసిఫికేషన్, కీలక ఖనిజాల అన్వేషణ వంటి బహుముఖ రంగాల్లో సంస్థ విస్తరణకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, సింగరేణిని అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు.

**ఉప ముఖ్యమంత్రికి అధికారుల సంఘం కృతజ్ఞతలు:**

సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలను ఇటీవల ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి, విస్తరణ, సుస్థిర భవిష్యత్తు కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అధికారుల తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని, సంస్థ అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తామని వారు స్పష్టం చేశారు.

# పోచారం 8వ డివిజన్‌లో కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

## - ఎస్ఐఆర్ ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్కేసర్, జూలై 13 : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచారం 8వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం ఇస్మాయిల్ ఖాన్‌గూడ, యంనంపేట్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్య క్రమాలతో పాటు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారు. కార్యక్రమానికి ముందు అయ్యప్పనగర్‌లోని హైదరాబాద్ హోటల్ ఇరానీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించి ఇంటింటికీ పర్యటిస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకోవడం, వివరాల సవరణ, మార్పులు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలను ప్రజలకు వివరించారు. కర్రె రాజేష్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ కార్యకర్తలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం బీఎల్ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచారం డివిజన్ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల కృష్ణారెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అడ్వైజర్ శ్రవణ్ కుమార్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు, ప్రజలకు కర్రె రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# రెండు నెలల పాటు సింగరేణి అధికారుల ఆందోళనలకు విరామం

## - సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో నిర్ణయం
## - గడువులోపు పరిష్కారం లేకుంటే ఉద్యమం పునఃప్రారంభిస్తామని హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై 13 : సింగరేణి అధికారుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూల హామీ ఇవ్వడంతో గత 15 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు రెండు నెలల పాటు విరామం ఇవ్వాలని కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) సింగరేణి శాఖ నిర్ణయించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం సింగరేణి అధికారుల సమస్యలను రెండు నుంచి మూడు నెలల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సీఎంఓఏఐ సింగరేణి శాఖ సభ్యులకు విడుదల చేసిన ప్రకటనలో, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఇంతకాలం ఐక్యంగా, క్రమశిక్షణతో ఉద్యమాన్ని విజయవంతం చేసిన ప్రతి అధికారికి సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

ప్రభుత్వం, యాజమాన్యం సానుకూలంగా స్పందించి రెండు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన హామీని గౌరవిస్తూ తమ నిరసన కార్యక్రమాలను రెండు నెలల పాటు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సంఘం వెల్లడించింది. ఈ గడువులో సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఒకవేళ నిర్ణీత సమయంలో హామీలు అమలు కాకపోతే సభ్యులతో సంప్రదించి తదుపరి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కోల్‌బెల్ట్ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు ఉద్యమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలిపిన నాయకులు, మీడియా ప్రతినిధులు, సింగరేణి అధికారులందరికీ సీఎంఓఏఐ సింగరేణి శాఖ కృతజ్ఞతలు తెలిపింది. కాగా రిలే నిరాహార దీక్షల ఉపసంహరణ విషయంపై సిఎంఓఏఐ సింగరేణి శాఖ ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులును సంప్రదించగా, ఉప ముఖ్యమంత్రి హామీ మేరకు దీక్షలు విరమిస్తున్నట్లు తెలిపారు. గత 15 రోజులుగా సింగరేణి వ్యాప్తంగా అధికారులు ప్రమోషన్ పాలసీ, వేతన సంబంధిత అంశాలు, వీఆర్‌సీ, పీఆర్‌పీతో పాటు ఇతర పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ హామీ నేపథ్యంలో తాత్కాలికంగా ఆందోళనలను నిలిపివేస్తున్నప్పటికీ, హామీలు అమలు కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతంగా కొనసాగిస్తామని సంఘం హెచ్చరించిం

# సింగరేణి అధికారుల నిరాహార దీక్షలకు రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘీభావం

## - ప్రమోషన్ పాలసీ, వీఆర్‌సీ, పీఆర్‌పీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, జూలై 13 : సింగరేణి అధికారుల సమస్యలను యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని భూపాలపల్లి సింగరేణి రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. భూపాలపల్లిలో గత 15 రోజులుగా కొనసాగుతున్న సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ రిలే నిరాహార దీక్షలకు సోమవారం అసోసియేషన్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి అధికారులకు సంబంధించిన ప్రమోషన్ పాలసీ, వీఆర్‌సీ, పీఆర్‌పీతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర హక్కులను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం, రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉన్నందున ఇరు ప్రభుత్వాలు అధికారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి యాజమాన్యం కూడా చొరవ తీసుకుని సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని కోరారు. కాగా సింగరేణి అధికారుల సమస్యల పరిష్కారానికి సోమవారం సానుకూల సంకేతాలు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు భూపాలపల్లి సింగరేణి రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సింగరేణి రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండపాక సాంబయ్య గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బందెల రూపయ్య, అంజయ్య, దయ్యాల శంకర్, ముఖ్య సలహాదారులు కొలిపాక నరసింహారావు, కనకం మల్లయ్య, ఆషాడం రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపులో పారదర్శకత పాటించాలి

## - కేకే కమిటీ ప్రజాసంఘాల సూచనలు తీసుకోవాలి
## - ఉద్యమకారుల సమావేశంలో తెలంగాణ ఉద్యమ నేతల డిమాండ్
## - ప్రజాస్వామిక తెలంగాణ సాధన వరకు ఉద్యమం కొనసాగుతుందన్న నేతలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూలై 13: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, నిజమైన ఉద్యమకారులకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (కేకే కమిటీ) ప్రజాసంఘాల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి అర్హులైన ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. భూపాలపల్లిలోని బాతల రాజన్న భవన్‌లో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో పీక కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో కామెర గట్టయ్య, జోగుల సమ్మయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారులతో పాటు రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి వారికి తగిన గౌరవం, సంక్షేమం కల్పించాలని వారు కోరారు. నిజమైన ఉద్యమకారుల ఆర్థిక పరిస్థితిని పరిశీలించి 250 గజాల ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులపై నమోదైన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, నిరుపేద ఉద్యమకారులకు రెండు ఎకరాల భూమి కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని కేసులు ఎదుర్కొని జీవనోపాధి కోల్పోయిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.25 వేల పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భౌగోళిక తెలంగాణ ఏర్పడినప్పటికీ ప్రజలకు పూర్తి స్థాయి న్యాయం జరగలేదని, ప్రజాస్వామిక తెలంగాణ రాష్ట్ర లక్ష్యాలు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సమావేశంలో ప్రకటించారు. త్వరలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమ నేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సమక్షంలో ఉద్యమకారుల భారీ సభ నిర్వహించనున్నట్లు పీక కిరణ్ వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు జాలిగం రాజు, రత్నం కిరణ్, ఐతే బాపు, మల్లేష్, పార్వతక్క, రావుల రమేష్, నారా శంకర్, లావణ్య, మనోజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





# భూపాలపల్లిలో ఐఎన్‌టీయూసీ బాయి బాట

## - కేటీకే-ఓసీ-2లో కార్మికులతో ముఖాముఖి..కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం
## - తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపును స్వాగతించిన నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూలై 13 : సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో సోమవారం "బాయి బాట" కార్యక్రమం నిర్వహిం చారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, జేబీసీసీఐ-11 స్టాండర్డైజేషన్ కమిటీ సభ్యుడు డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కేటీకే-ఓసీ--2 ప్రాజెక్టులో పిట్ సెక్రటరీ పొనగంటి కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసునూటి రాజేందర్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జోగ బుచ్చయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రత్నం సమ్మిరెడ్డి తదితరులు మాట్లాడుతూ కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ జాతీయ భద్రతా మార్గదర్శకాల ప్రకారం ఉత్పత్తి చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపును చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించిన వారు, ఈ కేటాయింపుతో సంస్థకు దీర్ఘకాలికంగా బొగ్గు నిల్వలు లభించి ఉద్యోగ భద్రత, ఉత్పత్తి, ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. కోయగూడెం బ్లాక్--3, సత్తుపల్లి బ్లాక్--3తో పాటు గోదావరి వ్యాలీలోని ఇతర బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల (అలియాస్ నేమ్స్) బాధితుల సమస్య పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ, త్వరలోనే బాధితులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే కారుణ్య నియామకాలు, కార్పొరేట్ మెడికల్ బోర్డు (సీఎంబీ) అంశాలపై కూడా అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. భూపాలపల్లి ఏరియా మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి గడిపే చక్రపాణి మాట్లాడుతూ, 2016, 2017 బ్యాచ్‌ల సీనియర్ మైనింగ్ సర్దార్‌లకు ఓవర్‌మ్యాన్ గ్రేడ్-బి ప్రమోషన్లు వెంటనే కల్పించాలని, అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన మైనింగ్ సిబ్బందికి ఉపరితలంలో తగిన ఉద్యోగాలు ఇవ్వాలని, అండర్ మేనేజర్ ప్రమోషన్లు, ఖాళీల భర్తీ, మైనింగ్ స్టాఫ్ క్యాడర్ స్కీమ్ సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్త ఎలక్ట్రానిక్ ఎక్స్‌ప్లోడర్లు, డెటోనేటర్లపై పూర్తి అవగాహన కల్పించే వరకు ప్రమాదాలకు మైనింగ్ సిబ్బందిని బాధ్యులను చేయరాదని కోరారు. ఓవర్‌మ్యాన్ పోస్టుల భర్తీ జరగకపోతే జూలై 22 నుంచి సీనియర్ మైనింగ్ సర్దార్‌లు తమ అసలు విధులు మాత్రమే నిర్వహిస్తారని హెచ్చరించారు. ఇటీవల జరిగిన సీఈఆర్ క్లబ్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ప్యానెల్ విజయం సాధించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, కొలిపాక నర్సింగరావు, బాగోదుల కుమారస్వామి, రాజకిరణ్, మండల శ్రీను, కొమురవెల్లి రాజయ్య, స్వామి, కొమురయ్య, భద్రయ్య, బార్ల నారాయణ, వీరయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై ఇసుక లారీల అక్రమ పార్కింగ్

## కలెక్టర్‌కు మద్దులపల్లి సర్పంచ్ సరిత వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, జూలై 13 : జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని కాళేశ్వరం-మద్దులపల్లి ప్రధాన రహదారిపై ఇసుక లారీలను ఇష్టానుసారంగా గంటల తరబడి పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మద్దులపల్లి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ఆమె మాట్లాడుతూ, ప్రధాన రహదారిపై వందల సంఖ్యలో ఇసుక లారీలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి ఇరుకుగా మారడంతో తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం పెరుగుతోందని పేర్కొన్నారు. ఇసుక లారీల పార్కింగ్ కారణంగా ఆర్టీసీ బస్సులు, పాఠశాల బస్సులు, అత్యవసర అంబులెన్స్ సేవలు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. స్థానిక ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు కూడా నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గతంలో సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని పేర్కొన్న సర్పంచ్, జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని ప్రధాన రహదారిపై ఇసుక లారీల పార్కింగ్‌ను నిషేధించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి రహదారిపై వాహనాలు నిలిపే వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.






# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం

## - భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట టిడబ్ల్యూజేఎఫ్ నిరసన-కలెక్టర్ అంకిత్‌కు వినతి
## - ఐక్య పోరాటాలకు జర్నలిస్టు సంఘాల పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూలై 13 : జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసనలో రాష్ట్ర కమిటీ సభ్యులు రాళ్లబండి కృష్ణమూర్తి, కటారి కృష్ణ, దాసరి వెంకటేశ్వరరావు (డీవీ) మాట్లాడుతూ, ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, ప్రత్యేక బీమా పథకం కల్పించాలని డిమాండ్ చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ పోరాటాల ఫలితంగానే అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో వెసులుబాటు కల్పించబడిందని పేర్కొంటూ, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్కు వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసనకు సంఘీభావం తెలిపిన తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జనుమాల రమేష్ మాట్లాడుతూ, జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1/70 చట్టాన్ని సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం సరికాదని, రైల్వే పాసులను పునరుద్ధరించి, అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు విధి నిర్వహణలో మరణించిన పాత్రికేయుల కుటుంబాలకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వట్టికొండ రవి మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గతంలో ప్రారంభించిన ఇళ్ల స్థలాల ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కురుమల్ల శంకర్ తదితర జర్నలిస్టు సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు వనమా శ్రీనివాసరావు, అల్లాడ రమేష్, జి. మధు, జి. వేణు, కుమ్మరి రమేష్, వెంకటాచారి, జయంత్, పీవీ, ఎంఎస్ మూర్తి, టిడబ్ల్యూజేఎస్ నాయకులు కొడాలి వెంకటేశ్వర్లు, వెంకన్న, వేణుగోపాల్, జలాల్, నందిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతోనే విద్యార్థుల ఆరోగ్యం-విద్యకు భరోసా



## - భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్
## - జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం 16వ విడత ప్రారంభం
## - జిల్లాలో 3,36,136 మంది పిల్లలు, యువతకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూలై 13 : విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడితేనే విద్యలో ప్రతిభ కనబరుస్తారని, నులిపురుగుల నివారణతో పోషకాహార లోపం తగ్గి చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం 16వ విడత కార్యక్రమాన్ని సోమవారం పాల్వంచ మండలం ఉలవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొల్లోరిగూడెం మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ప్రారంభించి విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి తగ్గడం, అలసట, కడుపునొప్పి, వికారం, విరోచ నాలు, బరువు తగ్గడం వంటి సమస్యలతో పాటు శారీరక ఎదుగుదల, మానసిక వికాసం, చదువుపై ఏకాగ్రత దెబ్బతింటాయని చెప్పారు. ఆల్బెండాజోల్ మాత్రలు పూర్తిగా సురక్షితమైనవని, నులిపురుగుల నివారణలో అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అపోహలకు తావివ్వకుండా ప్రతి అర్హత కలిగిన చిన్నారికి మాత్రలు వేయించాలని కోరారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 3,36,136 మంది పిల్లలు, యువతకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

# గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు !

పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే..చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్ధరణ జరగలేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కకూడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టిపోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు. గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు. చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్ధరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందు వరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డురవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడ గలదు.చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది. గతేడాది కంటే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. దేశంలో పంటల సాగుపై ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఎల్ నినో తీవ్ర రూపం దాల్చడంతో వానలు కరువయ్యాయి. మబ్బులే తప్ప చినుకు జాడలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 21శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలుపడలేదు. జూలై సగం నెల గడుస్తున్నా వానలు ముఖం చాటేసాయి. ఈ నెలలోనూ వర్షాలు కురువకపోవచ్చనే అంచనాలను వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఒకవేళ ముందుగానే పంటలు వేస్తే తర్వాత వర్షాలు కురువకపోతే పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంటుందని రైతులు భయపడుతున్నారు. దీంతో పంటలు సాగు చేసేందుకు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదంతా కూడా గ్రామాల్లో వాననీటిని ఒడిసి పట్టకపోవడం వల్ల జరిగిన నష్టంగా గుర్తించాలి. ఇప్పటికైనా గ్రామాల్లో తాగు, సాగునీటి ప్రాజెక్టును పునరుద్ధరించడం ద్వారా అభివృద్ధికి అడుగులు వేయాలి.

# వీడియో గేమ్స్: ప్రగతి ప్రయాణమా... వ్యసన ప్రమాదమా?

## వర్చువల్ ప్రపంచం... వలసపోతున్న బాల్యం!



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

డిజిటల్ సాంకేతిక విప్లవం మానవ జీవన విధానాన్ని సమూలంగా మార్చివేసింది.సమాచార రంగం,విద్య, వైద్యం, వాణిజ్యం, వినోదం వంటి ప్రతి క్షేత్రంలోనూ సరికొత్త ఆవిష్కరణలు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులలో అత్యంత వేగంగా, ప్రభావవంతంగా విస్తరించిన రంగం వీడియో గేమింగ్. ఒకప్పుడు కేవలం పసిపిల్లల కాలక్షేపానికి, కాసేపు ఆడుకునే ఆటలకే పరిమితమైన వీడియో గేమ్‌లు నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది దైనందిన జీవితంలో విడదీయరాని భాగమయ్యాయి. చిన్నారుల నుండి యువత వరకు, విద్యార్థుల నుండి ఐటీ ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరూ ఈ మాయా ప్రపంచంలో ఓలలాడుతున్నారు. కేవలం వినోదం కోసమే కాకుండా అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, అంతర్జాతీయ క్రీడలు, శాస్త్రీయ పరిశోధన వంటి అనేక విభిన్న రంగాల్లో వీడియో గేమ్‌ల వినియోగం నానాటికీ పెరుగుతోంది. అయితే, నాణేనికి రెండు ముఖాలు ఉన్నట్లుగానే, ఈ సాంకేతిక ప్రగతితో పాటు తీవ్రమైన శారీరక, మానసిక, సామాజిక సమస్యలపై కూడా సమాజంలో పెద్ద ఎత్తున మేధోమథనం జరుగుతోంది. అందువల్ల వీడియో గేమింగ్ రంగాన్ని సమతుల్య దృక్పథంతో, లోతైన విశ్లేషణతో పరిశీలించాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది.

ఈ ఆధునిక గేమింగ్ సామ్రాజ్యపు మూలాలు దాదాపు ఏడు దశాబ్దాల క్రితం నాటివి. 1958లో అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త విలియం హిగిన్బోథమ్ శూన్య నాళికల (వాక్యూమ్ ట్యూబ్స్) సాంకేతికతతో రూపొందించిన "టెన్నిస్ ఫర్ టూ" అనే సరళమైన ఆట తొలి వీడియో గేమ్‌గా చరిత్ర పుటల్లోకెక్కింది. ఆ తర్వాత 1972లో అటారి సంస్థ విడుదల చేసిన "పాంగ్" అనే ఆర్కేడ్ గేమ్ ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరమైన గేమింగ్ పరిశ్రమకు గట్టి పునాది వేసింది. అనంతరం నింటెండో, సెగా, సోనీ ప్లేస్టేషన్, మైక్రోసాఫ్ట్ ఎక్స్‌బాక్స్ వంటి దిగ్గజ సంస్థలు తమ వినూత్న ఆవిష్కరణలతో ఆధునిక డిజిటల్ గేమింగ్ ప్రపంచాన్ని సృష్టించాయి. ఇరవై ఒకటో శతాబ్దంలో కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ (ఆభాస వాస్తవికత), ఆగ్మెంటెడ్ రియాలిటీ (సమీకృత వాస్తవికత), క్లౌడ్ గేమింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు తోడవ్వడంతో, నేడు వీడియో గేమ్‌లు ఊహాజనిత ప్రపంచాన్ని దాటి కళ్ళముందు కదలాడే సజీవ దృశ్యకావ్యాలుగా, నిజ జీవిత అనుభూతిని కలిగించే స్థాయికి రూపాంతరం చెందాయి.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వీడియో గేమింగ్ పరిశ్రమ హాలీవుడ్, టాలీవుడ్ వంటి చలనచిత్ర పరిశ్రమల సంయుక్త ఆదాయాన్ని సైతం అధిగమించి అత్యంత వేగంగా విస్తరిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ విశ్లేషణల ప్రకారం, గ్లోబల్ గేమింగ్ పరిశ్రమ విలువ సుమారు 220 బిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా ఉంది. విశ్వవ్యాప్తంగా దాదాపు 300 కోట్లకు పైగా జనాభా ఏదో ఒక పరికరంలో నిరంతరం గేమ్‌లు ఆడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. భారతదేశం విషయానికి వస్తే, ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న టాప్ గేమింగ్ మార్కెట్లలో మన దేశం అగ్రస్థానంలో నిలుస్తోంది. చౌకైన స్మార్ట్‌ఫోన్‌లు, అతి తక్కువ ధరకే లభించే హై-స్పీడ ఇంటర్నెట్ డేటా, విప్లవాత్మక డిజిటల్ చెల్లింపుల (యూపీఐ) విస్తరణ కారణంగా భారత్‌లో మొబైల్ గేమింగ్ వినియోగం ఊహించని స్థాయికి చేరుకుంది. భారతీయ గేమింగ్ రంగం ప్రస్తుతం వేల కోట్ల రూపాయల వార్షిక ఆదాయంతో స్వయంసమృద్ధ ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. కేవలం వినియోగమే కాకుండా గేమ్ డెవలప్‌మెంట్, కోడింగ్, త్రీడీ యానిమేషన్, గ్రాఫిక్ డిజైనింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, ఈ-స్పోర్ట్స్ (ఎలక్ట్రానిక్ క్రీడలు) నిర్వహణ వంటి సృజనాత్మక రంగాల్లో దేశీయంగా లక్షలాది మంది మేధావులైన యువతీ యువకులకు ఇది ఉన్నతమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది.

ఈ విస్తరణ వెనుక ఉన్న వీడియో గేమ్‌ల సానుకూల ప్రయోజనాలను, వాటి బహుముఖ ఉపయోగాలను మనం విస్మరించలేము. నియంత్రిత సమయం లోపల, సరైన విజ్ఞాన దాయకమైన గేమ్‌లను ఎంపిక చేసుకొని ఆడినప్పుడు పిల్లలలో సమస్యల పరిష్కార సామర్థ్యం, వ్యూహాత్మక ఆలోచనా శైలి, ఏకాగ్రత, శీఘ్ర నిర్ణయాత్మక శక్తి మెరుగుపడతాయని శాస్త్రీయం గా నిరూపితమైంది. ఆటల్లోని క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో మెదడులోని నాడులు ఉత్తేజితమై, చేతికి-కంటికి మధ్య సమన్వయం (హ్యాండ్-ఐ కోఆర్డినేషన్), దీర్ఘకాలిక జ్ఞాపకశక్తి, పరిశీలనా దృష్టి పదునుదేరుతాయి. పజిల్స్, స్ట్రాటజీ గేమ్‌లు పిల్లలలో దాగివున్న సృజనాత్మకతకు పదును పెడతాయి. ఈ అద్భుత ఫలితాలను గమనించిన ప్రపంచంలోని అనేక అంతర్జాతీయ విద్యాసంస్థలు ప్రస్తుతం గణితం, భౌతిక శాస్త్రం, చరిత్ర, భూగోళశాస్త్రం వంటి క్లిష్టమైన పాఠ్యాంశాలను 'గేమిఫికేషన్' (ఆటల రూపంలో బోధన) పద్ధతిలోకి మార్చి బోధిస్తున్నాయి. నిరుత్సాహపరిచే పాతకాలపు చదువుల కంటే, ఇంటరాక్టివ్ గేమింగ్ ద్వారా విద్యార్థులు సబ్జెక్టులను ఎంతో ఆసక్తిగా, లోతుగా నేర్చుకుంటూ మెరుగైన ఫలితాలను సాధి స్తున్నారు.

దీనికి తోడు, ఆధునిక వైద్య క్షేత్రంలో సైతం వీడియో గేమ్‌ల అప్లికేషన్లు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేసే ముందు సర్జన్లకు డిజిటల్ సిమ్యులేషన్ గేమ్‌ల ద్వారా ముందస్తు శిక్షణ ఇస్తున్నారు. పక్షవాతం, ప్రమాదాల బారిన పడిన రోగుల పునరావాస చికిత్సలో (ఫిజియోథెరపీ), అల్జీమర్స్ వంటి జ్ఞాపకశక్తి లోపించిన వృద్ధులలో మెదడు చురుకుదనం పెంచడానికి వైద్యులు ప్రత్యేకమైన థెరప్యూటిక్ గేమ్‌లను ప్రిస్క్రైబ్ చేస్తున్నారు. రక్షణ రంగంలో సైనికులకు ప్రాణాంతకమైన సరిహద్దు యుద్ధ వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ వ్యూహరచన నేర్పడానికి హై-ఎండ్ సిమ్యులేటర్లను వాడు తున్నారు. విమానయాన రంగంలో కోట్ల రూపాయల ఖరీదైన పైలట్ల శిక్షణలో క్రాష్ రిస్క్ లేకుండా విమానాన్ని సురక్షితంగా నడపడం నేర్పడానికి గేమింగ్ సాంకేతికతే ప్రధాన ఆధారంగా నిలుస్తోంది.

అయితే, ఈ వెలుగుల వెనుక దాగివున్న చీకటి కోణాన్ని, తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను అంతే నిశితంగా పరిశీలించాల్సి ఉంది. రోజుకు గంటల తరబడి కంప్యూటర్ స్క్రీన్లు, మొబైల్ ఫోన్లకు అతుక్కు పోయే పిల్లలలో శారీరక శ్రమ పూర్తిగా శూన్యమవుతోంది. తద్వారా చిన్న వయసులోనే స్థూలకాయం (ఒబేసిటీ), వెన్నునొప్పి, మెడనొప్పి (టెక్స్ట్ నెక్ సిండ్రోమ్), కంటి చూపు మందగించడం, తీవ్రమైన తలనొప్పి, రాత్రిపూట నిద్రలేమి (ఇన్సోమ్నియా) వంటి దీర్ఘకాలిక శారీరక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. ఒకప్పుడు సాయంత్రం వేళల్లో మైదానాల్లో ఆడే బహిరంగ క్రీడలు, ప్రకృతితో మమేకం కావడం క్రమంగా మృగ్యమైపోతున్నాయి. బాల్యంలోనే ఇటువంటి నిశ్చల జీవన శైలికి అలవాటు పడితే, వారు భవిష్యత్తులో మధుమేహం, గుండె జబ్బులు వంటి తీవ్రమైన జీవనశైలి వ్యాధుల (లైఫ్‌స్టైల్ డిజార్డర్స్) బారిన పడే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తు న్నారు.

శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక సమతుల్యతకు కూడా మితిమీరిన గేమింగ్ తీవ్ర విఘాతం కలిగిస్తోంది. ఆటలో గెలిచినప్పుడు కలిగే విపరీతమైన ఆనందం, ఓడిపోయినప్పుడు వచ్చే తీవ్రమైన నైరాశ్యం పిల్లల మనస్తత్వాలను దెబ్బతీస్తున్నాయి. దీనివల్ల నిత్య జీవితం లో చిన్నపాటి అసంతృప్తి ఎదురైనా చిరాకు పడటం, అకారణంగా కోపం తెచ్చుకోవడం, తీవ్ర ఆందోళన (యాంగ్జైటీ), సమాజం నుండి ఒంటరిగా విడిపోవాలనే వైరాగ్యం, ఆత్మనియంత్రణ కోల్పోవడం వంటి తీవ్ర మానసిక వైకల్యాలు కొందరిలో బహిర్గతమవుతున్నాయి. ఈ తీవ్రతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2019వ సంవత్సరంలో "గేమింగ్ డిజార్డర్"ను అంతర్జాతీయ వ్యాధుల వర్గీకరణ జాబితాలో (ఐసీడీ-11) ఒక అధికారిక మానసిక రుగ్మతగా చేర్చింది. చదువును, కెరీర్‌ను, కన్నవారిని, కనీస సామాజిక బాధ్యతలను విస్మరించి, 24 గంటలూ గేమింగ్ లోకంలోనే బతికేయడాన్ని ఒక ప్రమాదకరమైన మత్తు వ్యసనంగా (అడిక్షన్) వైద్య లోకం పరిగణిస్తోంది. ఇటువంటి పరిస్థితులు ముదిరితే ప్రాథమిక దశలోనే మానసిక నిపుణుల (సైకియాట్రిస్ట్స్) సంప్రదింపులు, కౌన్సిలింగ్ అవసరమవుతాయి.

ముఖ్యంగా, చిన్న పిల్లలపై హింసాత్మక (వైలెంట్) గేమ్‌ల ప్రభావం గురించి అంతర్జాతీయంగా ఆందోళనకరమైన పరిశోధనా ఫలితాలు వెలువడుతున్నాయి. రక్తం ఏరులై పారడం, తుపాకుల కాల్పులు, సామూహిక విధ్వంసాలు, క్రిమినల్ శైలి నైపథ్యం ఉన్న గేమ్‌లను నిరంతరం ఆడే పిల్లల ఉపచేతన మనస్సులో (సబ్‌కాన్షియస్ మైండ్) క్రూరత్వం అలవోకగా నాటుకుపోతోంది. దీనివల్ల వారి నిజ జీవిత ప్రవర్తనలో కూడా దూకుడు స్వభావం, తోటివారిపై అసహనం, భావోద్వేగ అస్థిరత పెరిగి, చిన్న విషయాలకే నేరాలకు పాల్పడే ప్రవృత్తి బలపడుతుందని సామాజిక శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి; మార్కెట్లో ఉన్న ప్రతి గేమ్ హానికరమైనది కాదు. ఆటల రేటింగ్స్ (ఈఎస్ఆర్‌బీ వయోపరిమితి మార్కులు) ఆధారంగా వయస్సుకు తగిన ఆరోగ్యకరమైన గేమ్‌లను ఎంపిక చేయడం, తల్లిదండ్రుల నిరంతర పర్యవేక్షణ, కచ్చితమైన సమయపాలన ఉంటే ఇటువంటి ప్రతికూల ప్రభావాలను నూటికి తొంభై శాతం నివారించవచ్చు.

ఇక ప్రస్తుత ఆన్‌లైన్ మల్టీప్లేయర్ గేమింగ్ యుగంలో సరికొత్త సైబర్ సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇంటర్నెట్ వేదికగా ఆడేటప్పుడు ప్రపంచంలోని ఏ మూలలోనో ఉన్న ముఖం తెలియని అపరిచితులతో (స్ట్రేంజర్స్) పరిచయాలు ఏర్పడటం, ఆ మైకంలో ఇళ్లలోని రహస్యాలు, వ్యక్తిగత సమాచారాన్ని (డేటా ప్రైవసీ) పంచుకోవడం వల్ల సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ బ్లాక్‌మెయిలింగ్, ఆర్థిక మోసాలు నిత్యకృత్యమవుతున్నాయి. కొన్ని గేమ్‌లలో వర్చువల్ ఆయుధాలు, దుస్తులు కొనుగోలు చేయడానికి (ఇన్-యాప్ పర్చేసెస్) పిల్లలు తల్లిదండ్రులకు తెలియ కుండా వారి క్రెడిట్ కార్డులు, బ్యాంకు ఖాతాల ద్వారా లక్షలాది రూపాయల నగదును హారతి కర్పూరంలా కరిగించిన గుండె కోత మిగిల్చే సంఘటనలు దేశవ్యాప్తంగా నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అందు వల్ల పిల్లలు అసలు మొబైల్‌లో ఏ గేమ్ ఆడుతున్నారు, వర్చువల్ ప్రపంచంలో ఎవరితో



చాటింగ్ చేస్తున్నారు, ఎంత సమయం వెచ్చిస్తున్నారు అనే విషయాలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచడం అత్యంత ప్రథమ కర్తవ్యం.

ఈ సవాళ్లన్నింటినీ అధిగమించి చూస్తే, గేమింగ్ రంగం నేటి తరం యువతకు ఊహించని సరికొత్త కెరీర్ అవకాశాలను, అపారమైన కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెడుతోంది. సాంప్రదాయ క్రికెట్, ఫుట్‌బాల్ తరహాలోనే నేడు 'ఈ-స్పోర్ట్స్' అంతర్జాతీయ ఒలింపిక్స్ స్థాయి గుర్తింపును పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల కొద్దీ బహుమతి మొత్తాలతో (ప్రైజ్ పూల్స్) నిర్వహించే టోర్నమెంట్లలో భారతీయ యువత సైతం పాల్గొని అంతర్జాతీయ వేదికలపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్నారు. కేవలం ఆటగాళ్ళుగానే కాకుండా గేమ్ డైరెక్టర్, స్క్రిప్ట్ రైటర్, సౌండ్ ఇంజనీర్, క్యారెక్టర్ యానిమేటర్, గేమ్ స్ట్రీమింగ్ (యూట్యూబ్ లైవ్) వంటి రంగాలలో అసాధారణ ప్రతిభ గల యువతకు నెలకు లక్షల రూపాయల ఆదాయం లభిస్తోంది. కానీ, ఈ గ్లామర్ ప్రపంచంలో స్థిరపడాలంటే కేవలం మొబైల్ పట్టుకు కూర్చుంటే సరిపోదు; దానికి అంకితభావం, కఠినమైన క్రమశిక్షణ, రోజువారీ సాధనతో పాటు ప్రాథమిక విద్యాభ్యాసం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సమానంగా ఉండాలనే సత్యాన్ని యువత గ్రహించాలి.

ఈ క్లిష్టమైన డిజిటల్ సంక్షోభం నుండి రేపటి తరాన్ని కాపాడుకోవడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు మరియు ప్రభుత్వాలు ఒక సంయుక్త వ్యూహంతో ముందుకు సాగాలి. ఇళ్లలో పిల్లలకు రోజువారీ డిజిటల్ స్క్రీన్ సమయాన్ని (స్క్రీన్ టైమ్) గరిష్టంగా ఒక గంటకు మించకుండా నియంత్రించాలి. డిజిటల్ పరికరాలకు ప్రత్యామ్నాయంగా సాయంత్రం వేళల్లో మైదానాల్లో ఆడే ఆటలు, శారీరక వ్యాయామం, సృజనాత్మక పుస్తక పఠనం, శాస్త్రీయ సంగీతం, చిత్రలేఖనం, మానసిక ప్రశాంతతను ఇచ్చే యోగా వంటి సత్కార్యకలాపాల వైపు పిల్లల మనస్సును మళ్లించాలి. వీటన్నింటి కంటే ముఖ్యంగా, తల్లిదండ్రులు తమ బిజీ షెడ్యూల్స్ పక్కనపెట్టి పిల్లలతో నాణ్యమైన సమయాన్ని (క్వాలిటీ టైమ్) గడపాలి, వారితో మనసు విప్పి మాట్లాడాలి. పాఠశాలల్లో కేవలం మార్కు ల కోసమే కాకుండా డిజిటల్ అక్షరాస్యతతో పాటు, బాధ్యతా యుతమైన ఇంటర్నెట్ మరియు గేమింగ్ వినియోగంపై (డిజిట ల్ వెల్‌నెస్) ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వాలు కూడా ఆన్‌లైన్ భద్రతను పటిష్టం చేస్తూ, కఠినమైన వయోపరిమితి చట్టాలను తేవడంతో పాటు సైబర్ నేరాల నియంత్రణకు పటిష్టమైన యంత్రాంగాన్ని అమలు చేయాలి.

ముగింపుగా చెప్పాలంటే, వీడియో గేమ్‌లు అనేవి ఆధునిక సాంకేతికత, అద్భుత సృజనాత్మకత, విజ్ఞానం మరియు వినోదాల సమ్మేళనంతో రూపుదిద్దుకున్న ఇరవై ఒకటో శతాబ్దపు అద్భుత సాధనాలు. మారుతున్న కాలంలో వాటిని సమాజం నుండి పూర్తిగా బహిష్కరించడం లేదా నిరాకరించడం ఎంతమాత్రం వివేకం అనిపించుకోదు; అదే సమయంలో వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవడం అత్యంత ప్రమాదకరం. పరిమిత సమయం, విజ్ఞానదాయకమైన ఆటల ఎంపిక, పెద్దల పర్యవేక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానం, కఠినమైన డిజిటల్ క్రమశిక్షణ అనే పంచసూత్రాలను పాటిస్తే వీడియో గేమ్‌లు మన పిల్లల అభ్యాసానికి, మేధో వికాసానికి, నైపుణ్యాభివృద్ధికి, ఉపాధి సృజనకు మరియు సృజనాత్మక ఆలోచనలకు తిరుగులేని ఇంజన్లుగా దోహదపడతాయి. విచక్షణతో కూడిన బాధ్యతాయుతమైన వినియోగమే వీడియో గేమింగ్ రంగాన్ని సమాజ ప్రగతికి ఉపయోగపడే ఒక శక్తివంతమైన సానుకూల సాధనంగా మార్చగలదు. మన యువత, పిల్లలు సాంకేతికతకు బానిసలుగా (స్లేవ్స్) మారిపోకుండా, దానిని తమ ఎదుగుదలకు వాడుకునే సద్గుణాలు గల బాధ్యతాయుత పౌరులుగా ఎదిగినప్పుడే ఈ డిజిటల్ విప్లవ యుగం యొక్క అసలైన ప్రయోజనం మానవాళికి సాకారమవుతుంది.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

# సమస్యలు పరిష్కరించకుంటే సమరమే : ఎండీ యూసఫ్

### - రూ.18 వేల గౌరవ వేతన హామీ అమలు చేయాలని డిమాండ్

### - అంగన్వాడీల పాదయాత్ర ముగింపు.. కలెక్టరేట్ ముట్టడి విజయవంతం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూలై 13 : అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, వారి సహనాన్ని చేతగానితనంగా భావించొద్దని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్వాడీ టీచర్స్-హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రెండో రోజు పాదయాత్ర సోమవారం పాల్వంచ పెద్దమ్మతల్లి దేవాలయం నుంచి ప్రారంభమైంది. ఎండీ యూసఫ్ జెండా ఊపి ప్రారంభించిన ర్యాలీ అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కలెక్టరేట్‌కు చేరింది. అక్కడ వందలాది మంది అంగన్వాడీలు ధర్నా నిర్వహించి తమ సమస్యలపై వినతిపత్రాన్ని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనిన్కు అందజేశారు. ఈ సందర్భంగా యూసఫ్ మాట్లాడుతూ, అంగన్వాడీలు కట్టు బానిసలు కారని, తక్కువ వేతనాలతో అధిక పనిభారం మోపే విధానాన్ని ఇక సహించబోమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.18 వేల గౌరవ వేతనం హామీని ముఖ్యమంత్రి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మాతా--శిశు సంరక్షణ, పోషకాహార పంపిణీ, చిన్నారుల సంక్షేమంలో అంగన్వాడీల సేవలు కీలకమని, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించకుండా అదనపు విధులు అప్పగించడం శ్రమదోపిడీయేనని విమర్శించారు. పనిభారం తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, ఉద్యమాలను




అణచివేయాలని ప్రయత్నిస్తే రాష్ట్రవ్యాప్తంగా సమరభేరి మోగిస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల పోరాటానికి ఏఐటీయూసీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. భద్రాచలం నుంచి ప్రారంభమైన సుమారు 40 కిలోమీటర్ల పాదయాత్ర సోమవారం కలెక్టరేట్ చేరడంతో ముగిసింది. రెండు రోజుల పాటు సాగిన యాత్రకు పలుచోట్ల స్వాగతం లభించింది. పాల్వంచలో సీపీఐ నాయకులు ఆడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, వీషంశెట్టి విశ్వేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు, నరాటి ప్రసాద్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతా మహాలక్ష్మి, రాష్ట్ర నాయకులు సాయి ఈశ్వరి, కరుణకుమారి, జిల్లా నాయకులు రెడ్డి అరుణ, గోనె మణి, ముప్వా లక్ష్మీకుమారి, కంచర్ల జమలయ్య, వేల్పుల మల్లికార్జున్, రాజు, షాహిన్, ధనలక్ష్మి, కైసర్ పద్మ, లక్ష్మి, ప్రమీలరాణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రారంభించిన ఆర్డీవో

### - ఓటర్లు సందేహాలు నివృత్తి చేసుకుని సేవలను వినియోగిం చుకోవాలని సూచన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




జయశంకర్-భూపాలపల్లి, జూలై 13 :ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎన్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అవసరమైన సమాచారం అందించేందుకు భూపాలపల్లి లోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని భూపాలపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి హరికృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో హరికృష్ణ మాట్లాడుతూ, సమగ్ర ఓటరు జాబితా సవరణకు సంబంధించిన దరఖాస్తులు, పేర్ల నమోదు, సవరణలు, మార్పులు, అవసరమైన పత్రాలు తదితర అంశాలపై ఓటర్లకు మార్గదర్శనం చేసేందుకు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు తమకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు అవసరమైన సమాచారాన్ని ఈ కేంద్రం ద్వారా పొందాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, జీపీఓ కిరణ్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సాగర్, శ్రావణ్, రాజ్‌కుమార్, వరుణ్‌లు పాల్గొన్నారు.

# సింగరేణి భరోసా యాత్రలో మణుగూరులో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**- మణుగూరు భవిష్యత్తుకు కేంద్రం అండగా ఉంటుందని మంత్రి భరోసా**
**- డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని టిబిజీకేఎస్ వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూలై 13 : సింగరేణి భరోసా యాత్రలో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సోమవారం సింగరేణి మణుగూరు ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా మణుగూరులోని ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులను సందర్శించి ఉత్పత్తి కార్యకలాపాలను పరిశీలించారు. మణుగూరు ప్రాంత అభివృద్ధి, సింగరేణి భవిష్యత్తు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, మణుగూరుకు బంగారు భవిష్యత్తు కల్పించే దిశగా తనవంతు కృషి చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. పర్యటన సందర్భంగా మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కేంద్ర మంత్రిని కలిసి బొగ్గు గనుల విస్తరణకు చర్యలు తీసుకుని మణుగూరు ప్రాంత మనుగడను పరిరక్షించాలని వినతిపత్రం సమర్పించారు. కేంద్ర మంత్రికి స్థానికంగా ఘన స్వాగతం లభించింది.

**డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని టీబీజీకేఎస్ డిమాండ్:**

ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్-2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్‌ను వేలం ప్రక్రియ నుంచి మినహాయించి నేరుగా సింగరేణికి కేటాయించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మణుగూరు ఏరియా కార్మికులు ప్రతి సంవత్సరం నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను అధిగమిస్తూ సింగరేణి అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, వారి సేవలను గుర్తించి భావితరాల ఉపాధి, ఏరియా మనుగడను దృష్టిలో ఉంచుకుని డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను నేరుగా సింగరేణికి కేటాయించాలని కోరారు. అలాగే మణుగూరు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. డిప్‌సైడ్ బ్లాక్ కేటాయింపులో జాప్యం జరిగినా, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అనుమతులు ఆలస్యమైనా ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను ప్రత్యేక అధికారాలతో సింగరేణికి కేటాయించిన తరహాలోనే డిప్‌సైడ్ బ్లాక్‌ను కూడా నేరుగా సింగరేణికి కేటాయించాలని, దీంతో అధిక నాణ్యత గల బొగ్గు నిక్షేపాల వినియోగం పెరిగి సంస్థ ఆదాయం, రాష్ట్ర ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నందున సంస్థ ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని వినతిపత్రంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు రాసిన లేఖ ప్రతిని కూడా కేంద్ర మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు బంగారి పవన్ కుమార్, బొద్దుల ప్రవీణ్ కుమార్, జంగం రాజ్ కుమార్, సాంబార్ రాజశేఖర్, గుగులోత్ రమేష్ నాయక్, పద్దం శ్రీనివాస్, బాలాజీ, ధారావత్ కృష్ణ, నిఖిల్, వేముల నవీన్, గొర్రె ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కుంభకోణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**- కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి - ఆదాయపు పన్ను భారం నుంచి కార్మికులకు ఉపశమనం కల్పించాలి - కేంద్రంపై, కిషన్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎంపీ విమర్శలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూలై 13 : సింగరేణి సంస్థలో చోటుచేసుకున్న అవకతవకలు, కుంభకోణాలపై సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో బీఆర్ఎస్ అడ్డుకుందని ఆయన పేర్కొన్నారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ రవిచంద్ర మాట్లాడారు. సింగరేణిలో తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరిగిన సమయంలో సింగరేణి పరిరక్షణ కోసం బీఆర్ఎస్, కార్మిక సంఘాలు పెద్దఎత్తున ఉద్యమించాయని చెప్పారు. తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయింపునకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యక్తిగత కృషి కారణం కాదని, కార్మిక సంఘాల పోరాటం, రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి ఫలితంగానే ఆ నిర్ణయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రతినిధిగా తాను పలుమార్లు కేంద్ర బొగ్గు శాఖను కలిసి సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు అంశాలను ప్రస్తావించానని తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు నష్టాల్లో ఉన్న సింగరేణిని కేసీఆర్ ప్రభుత్వం లాభాల బాట పట్టించిందని, 2023 డిసెంబర్ నాటికి రూ.3,200 కోట్ల లాభాలతో సంస్థను అప్పగించిందని రవిచంద్ర అన్నారు. కేసీఆర్ హయాంలో వేలాది కారుణ్య నియామకాలు చేపట్టగా, ప్రస్తుతం అవి నిలిచిపోవడం బాధాకరమని విమర్శించారు. సింగరేణిలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న కుంభకోణాలపై మాజీ మంత్రులు కేటీఆర్,



హరీశ్ రావు కేంద్ర మంత్రికి లేఖలు రాసినా స్పందన లేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం రెండూ సింగరేణి ప్రయోజనాల పరిరక్షణలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. సత్తుపల్లి, కోయగూడెం, శ్రావణపల్లి, కళ్యాణఖని తదితర బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని, సింగరేణి కార్మికులపై ఆదాయపు పన్ను భారం తగ్గించే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రచురించిన "రేవంత్ రెడ్డి... మా రక్తం ఎంత కావాలో తీసుకో, కాళేశ్వరం నీళ్లను మాత్రం మా పంట పొలాలకు ఇవ్వు" అనే పోస్టర్‌ను ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రాంమూర్తి, గుండ్లపల్లి శేషగిరిరావు, పగడాల నాగరాజు, లక్కినేని సురేందర్, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి




**- ఎమ్మెల్యే ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**
**- జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం ప్రారంభం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, జూలై 13 : చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణ కీలకమని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తోందన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, విరోచనాలు, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తడంతో పాటు చదువులు, ఆటల్లో వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో పిల్లల ఆరోగ్య, విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆహారం తీసుకునే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్, కోరం సురేందర్, లక్కినేని శ్యామ్, రవి, వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు డి. నాగేశ్వరరావు, బి. నాగేశ్వరరావు, అమర్ సింగ్, తారాబాయి, రమాదేవి, జానకి, మంగమ్మ, సునీత, ఈపీ రాజు, హాము, సైదులు, రాంబాబు, కిషోర్ సింగ్, రవికుమార్, లక్ష్మీనారాయణ, బద్రు, రమేష్, మోతిలాల్, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్వైజర్లు గుజ్జా విజయ, కౌసల్య సింగ్, ఏఎన్ఎంలు బిజ్జా అనసూయ, వెంకటరమణ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీఎల్ఏలు అప్రమత్తంగా పనిచేయాలి



**- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూలై 13 : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సూచించారు.సోమవారం రాజాపేటలో నిర్వహించిన బీఎల్ఏల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు, నకిలీ నమోదులు, అనర్హుల పేర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక వ్యక్తి పేరు రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓటరుగా నమోదు కావడం చట్టవిరుద్ధమని, అలాంటి సందర్భాల్లో ఎన్నికల అధికారులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ప్రతి ఓటరు ఒకే నియోజకవర్గంలో మాత్రమే నమోదు ఉండేలా అవగాహన కల్పించాలని బీఎల్ఏలకు సూచించారు. ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ప్రత్యేక ఓటరు జాబితా సవరణను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అర్హులైన కొత్త ఓటర్ల పేర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితాను తప్పులులేనిదిగా రూపొందించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సటు తిరుమలేష్, సంధిల భాస్కర్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, ఎర్రగోకుల జశ్వంత్, బోగ హరినాథ్, పల్లె సంతోష్, చింతల సంపత్, గుర్రం నర్సిములు, బూర్గు నర్సిరెడ్డి, సోమలింగం, కర్ణాకర్ రెడ్డి, రెడ్డబోయిన రాజు, మేక వెంకటేశ్వర రెడ్డి,చెరుకు కనకయ్య, సామల రమేష్, సత్యనారాయణ రెడ్డి, నాగిర్తి గోపి, బిళ్లకుదురు రాజు, వేముల సంపత్, గంధమల్ల సురేష్, లక్ష్మయ్య, రవి, నీల బిక్షపతి, బాలకృష్ణ, కట్కూరి రమేష్‌తో పాటు పలువురు నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి భరోసా యాత్ర'కు ఘన స్వాగతం పలకాలి

**--బీజేపీ నేతల పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూలై 13 : తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు ఎలాంటి వేలం ప్రక్రియ లేకుండా కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నేపథ్యంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర'ను కార్మికులు, ప్రజలు, బీజేపీ, బీఎంఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బల్మూరి వనిత, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, తొలిసారిగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి రానున్న సందర్భంగా ఘన స్వాగతం పలకాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని ఏటీఎంలా ఉపయోగించుకున్నాయని విమర్శించిన వారు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం కార్మికుల ప్రయోజనాలు, సింగరేణి పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి టెండర్ ప్రక్రియ లేకుండానే తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నుంచి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన 'సింగరేణి భరోసా యాత్ర' మంగళవారం ఉదయం 11 గంటలకు ఆర్జీ-1, ఓసీపీ-5 గనికి చేరుకుంటుందని తెలిపారు. అక్కడ గనిని సందర్శించి కార్మికులతో సమావేశమై




వారి సమస్యలను తెలుసుకుంటారని, అనంతరం విలేకరులతో మాట్లాడతారని వెల్లడించారు. ఆ తర్వాత 5 ఇంక్లైన్ చౌరస్తా నుంచి గంగా నగర్ గోదావరి బ్రిడ్జి వరకు సుమారు వెయ్యి బైక్‌లతో భారీ బైక్ ర్యాలీ, అక్కడి నుంచి మంచిర్యాల జిల్లాకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్మికులు, ప్రజలు, బీజేపీ, బీఎంఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ భరోసా యాత్రను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల్ల మహేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ, బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి, కార్పొరేటర్ తోట మమత, బీజేపీ, బీఎంఎస్ నాయకులు గుండబోయిన భూమయ్య, బోడకుంట సుభాష్, తోట కుమారస్వామి, మిట్టపల్లి సతీష్, సుల్వ లక్ష్మీ నర్సయ్య, ఊరగొండ అపర్ణ, ఆకుల శశికుమార్, పెండెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# కొరికిశాల కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే

**- తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**
**- విద్యార్థుల విద్య, వసతి, భోజన సదుపాయాలపై ఆరా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూలై 13 : భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న విద్య, భోజనం, వసతి తదితర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే మిషన్ భగీరథ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించి నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న విద్యా, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వార్డెన్లు, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న స్నాక్స్ నాణ్యతను పరిశీలించిన ఎమ్మెల్యే, వారితో కలిసి స్నాక్స్ తీసుకుంటూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి తహసీల్దార్, కేజీబీవీ ప్రిన్సిపాల్, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, స్థానిక సర్పంచ్, మండల నాయకులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం: జిల్లా ఎస్పీ సంకీర్త్

**- ప్రజాదివాస్‌లో 17 ఫిర్యాదుల స్వీకరణ.. వెంటనే చర్యలకు అధికారులకు ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూలై 13 : ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను ఆయన స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 17 ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ, ప్రతి వినతిని శ్రద్ధగా విని సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు జారీ చేశారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి మధ్యవర్తులు, పైరవీలు ఆశ్రయించకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించి చట్టం ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతిభద్రతల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్పష్టం చేశారు.

# "సోలార్ రంగంలో యువతకు అపార ఉపాధి అవకాశాలు"

**- సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**
**- భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి.**
**- సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సోలార్ టెక్నీషియన్ శిక్షణ ప్రారంభం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, జూలై 13 : "దేశంలో పునరుత్పాదక ఇంధన రంగం వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా సోలార్ ఎనర్జీ రంగంలో నైపుణ్యం కలిగిన యువతకు రానున్న రోజుల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. శిక్షణార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి" అని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. భూపాలపల్లి ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన సోలార్ టెక్నీషియన్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, సంప్రదాయ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్‌కు దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని, దీంతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి, ప్యానెల్‌ల ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు, నిర్వహణ సేవల రంగాల్లో శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులకు మంచి డిమాండ్ ఏర్పడుతోందని తెలిపారు. ఈ శిక్షణలో సోలార్ ప్యానెల్‌ల అమరిక, నిర్వహణ, లోపాల గుర్తింపు, మరమ్మతులు, ఇన్‌వర్టర్ వ్యవస్థలు, విద్యుత్ భద్రతా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ ద్వారా యువతను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్ది, స్వయం ఉపాధితో పాటు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందేలా చేయడమే సింగరేణి లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతిక విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంకు ప్రత్యేకాధికారి కృష్ణ ప్రసాద్, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ నజీర్, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్, ట్రైనర్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**- పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నది - కాంగ్రెస్ ప్రభుత్వమే**
**- బీఆర్ఎస్ హయాంలో నాసిరకం బియ్యంతో ప్రజలను మోసం చేశారని విమర్శ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, జూలై 13 : భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాప్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆహార భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తే ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని చెప్పి పేదలను తప్పుదోవ పట్టించిందని, నాణ్యతలేని దొడ్డు బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. అయితే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని చెప్పారు.



## పంచకట్టు వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూలై 13 : ఖమ్మం రూరల్ మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో మారెమ్మ తల్లి ఆలయం సమీపంలోని ఆర్కే రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పంచకట్టు, ఓణీల వేడుకకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం హాజర య్యారు. చింతపల్లి గ్రామానికి చెందిన వల్లపు వెంకటేశ్వర్లు -ప్రమీల దంపతుల కుమార్తె, కుమారుడి పుష్పాలంకరణ, పంచకట్టు వేడుకల్లో పాల్గొన్న ఆయన చిన్నారులను ఆశీర్వదించి, వారి ఉజ్వ ల భవిష్యత్తును ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ ముత్యం చిన్న కృష్ణారావు, తోట సుధాకర్, మేకపోతుల చిన్న పరమయ్య, ఆరెంపుల రామయ్య, సర్పంచ్ పాపా నాయక్, బుర్ర రాజేష్, గునిగంటి సురేష్, దాసరి బుచ్చిరాములు, వల్లపు కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, టీం పొంగులేటి పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్ ఆరెంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి మృతికి సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఘట్కేసర్, జూలై 13 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం అన్నోజిగూడ గ్రామంలోని ఆర్‌జీకే కాలనీలో నివాసం ఉంటున్న గుర్రపు సాయికుమార్ మృతి పట్ల టీం రేవంత్ అన్న రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి ఆర్‌జీకే గ్రామ కాంగ్రెస్ కమిటీ నాయకుల ద్వారా సమాచారం అందుకున్న సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సోమవారం మృతుడి నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జూలూరుపాడు వద్ద రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 13 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం దండుమిట్ట తండా సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బైక్‌ను కారు ఢీకొనడంతో కొత్తగూడెం పట్టణానికి చెందిన షేక్ హంజాద్ (20) తీవ్రంగా గాయపడి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న జూలూరుపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## కొత్తగూడెం గణేష్ టెంపుల్‌లో విశేష పూజలు

**- మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం**

**- రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 13 : మాస శివరాత్రి సందర్భంగా భద్రాద్రి-కొత్తగూడెం పట్టణంలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మహా న్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్ర హోమం, అనంతరం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక దర్శనం చేసుకుని స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణా ధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ నెలకొన్నట్లు ఆమె పేర్కొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**- జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్**

**- హెల్మెట్ ధారణే ప్రాణ రక్షణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, జూలై 13 : మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధ నలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. టూ వీలర్‌పై ప్రయాణించే డ్రైవర్‌తో పాటు పిలియన్ రైడర్ కూడా బీఐఎస్ ప్రమాణాలు కలిగిన హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. అలాగే బైక్‌పై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని, మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, సెల్‌ఫోన్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నళ్ల ఉల్లంఘన వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని హెచ్చరించారు. ప్రమాదాల సమయంలో తలకు గాయాలు అత్యంత ప్రమాదకరమైనవని, అందుకే ప్రతి ప్రయాణంలో హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్, 100 పోలీస్ లేదా 101 అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలని, తొలి గంట (గోల్డెన్ అవర్)లో చికిత్స అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికేట్ వెంట ఉంచుకోవాలని లేదా డిజిలాకర్, ఎం-పరివాహన్ యాప్‌లో భద్రపరచుకోవాలని సూచించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ దివాకర టీఎస్

### ప్రజల సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూలై 13 : ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపిస్తూ అర్హత, నిబంధనల మేరకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో జనాభా అధికంగా ఉన్నందున రెండో రేషన్ దుకాణాన్ని మంజూరు చేయాలని గ్రామస్థులు చేసిన విజ్ఞప్తిపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి నివేదిక సమర్పించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంతరాణి ప్రీ-ప్రైమరీ ఆయా పోస్టు భర్తీకి మెరిట్ జాబితాలో పేరు ఉన్నప్పటికీ నియామకం లభించలేదని చేసిన ఫిర్యాదును జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించి పరిశీలించాలని ఆదేశించారు. తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్‌కు వైరా బీసీ మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలలో ప్రవేశం కల్పించాలని చేసిన వినతిని బీసీ సంక్షేమ శాఖ ప్రాంతీయ అధికారికి పంపించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంకు చెందిన డి. ఉపేంద్ర బ్లాక్ ఫంగస్ కారణంగా చూపు కోల్పోయిన నేపథ్యంలో దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని చేసిన విజ్ఞప్తిని సంబంధిత అధికారులకు పంపిస్తూ సదరం ప్రక్రియ పూర్తి చేసి అర్హత మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఆదివాసీలకు ఉపయోగపడని ఐటీడీఏ కార్యాలయాన్ని రద్దు చేయాలి

**- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా**

**- గడ్డూరిగట్టు, కొయ్యూరు, మామీడిగూడెం పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 13 : ఆదివాసీల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన భద్రాచలం ఐటీడీఏ కార్యాలయాన్ని రద్దు చేయాలని, పోడు భూములకు ఎలాంటి ఆటంకాలు లేకుండా హక్కు పట్టాలు ఇవ్వడంతో పాటు ఫారెస్ట్ అధికారులు నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఐటీడీఏ పీఓ రాహుల్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గడ్డూరిగట్టు, కొయ్యూరు, మామీడిగూడెం గ్రామాల



ఆదివాసీలు తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, సర్వేలు జరిగినప్పటికీ ఫారెస్ట్ అధికారులు భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ, సర్వేలకు అడ్డుపడి, మొక్కలు నాటి, అక్రమ కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాలేదని, పంటలను ధ్వంసం చేసినా నష్టపరిహారం ఇవ్వలేదని అన్నారు. గ్రామసభ తీర్మానాలు, పీసా చట్టం, రాజ్యాంగంలోని ఐదో, ఆరవ షెడ్యూళ్ల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఫారెస్ట్ అధికారులు ఆదివాసుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. అక్రమంగా కేసులు నమోదు చేసిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకుని, బాధ్యులైన అధికారులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం స్వీకరించిన పీఓ రాహుల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో మట్ట నరసింహారావు, కుంజ జోగారావు, ఇర్ప ప్రసాద్, తెల్లం పెంటమ్మ, సర్పంచ్ జోగారావు, మధు, కొండా స్వామి, రాజమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం: ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



**- ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**- వేంసూరు మండలానికి గోదావరి జలాలు చేరడంపై హర్షం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


సత్తుపల్లి, జూలై 13 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు రాజీవ్ కాలనీలో సోమవారం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని లబ్ధిదారులు శ్రీరాముల లక్ష్మి, కృష్ణలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సొంతింటి కల నెరవేరడం ప్రతి పేద కుటుంబానికి ఆనందకరమైన సందర్భమని అన్నారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు వేంసూరు మండలానికి గోదావరి జలాలు చేరడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది ఊరటనిస్తుందని, కాల్వల్లో నీరు ప్రవహించడం రైతుల్లో కొత్త ఆశలు నింపిందన్నారు. రైతుల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రోహన బేగం కమల్ పాషా, 7వ వార్డు కౌన్సిలర్ నసీమ షరీఫ్, కౌన్సిలర్లు హకీమ్, శరత్, సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు, రాజీవ్ కాలనీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు భద్రాద్రి పోలీసుల కఠిన చర్యలు


### అదుపులో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 13 : మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణ లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు పోలీసులు గంజాయి వినియోగం, విక్రయం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోతువాగు ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన పోలీసులు గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. గంజాయి వల్ల కలిగే ఆరోగ్య, మానసిక, కుటుంబ, సామాజిక దుష్పరిణామాలపై వారికి అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. కొత్తగూడెం డీఎస్పీ ఆది నారాయణ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణలో రాజీపడే ప్రసక్తే లేదని, యువత భవిష్యత్తు కోసం అవగాహన కార్యక్రమాలతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-112కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సై అఖిలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# అశ్వారావుపేటలో పిచ్చికుక్క బీభత్సం



**- 30 మందిపై దాడి.. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స**

**- వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

అశ్వారావుపేట, జూలై 13 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని గోగులుబంధం షిరిడి సాయినగర్‌లో సోమవారం పిచ్చికుక్క బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు సహా 30 మందికి పైగా స్థానికులపై దాడి చేసి గాయపరిచింది. దాడిలో గాయపడిన వారికి కాళ్లు, చేతులు, ముఖంపై గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి రేబిస్ నిరోధక టీకాలు (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) వేస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న మున్సిపల్ సిబ్బంది గోగులుబంధం, షిరిడి సాయినగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో పిచ్చికుక్క కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వీధి కుక్కల నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

### రూ.10 వేల జరిమానా విధించిన కోర్టు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 13 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో (గూజూరా) కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో భద్రాద్రి-కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్. సరిత సోమవారం కీలక తీర్పు వెలువరించారు. నిందితుడు ఎదునూరి వీరయ్యకు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించారు. కేసు వివరాల ప్రకారం, 2025 జూన్ 10న పాల్వంచ మండలం రెడ్డిగూడెం శివారు ప్రభాత్‌నగర్‌లో నివాసముంటున్న ఆరేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఎదునూరి వీరయ్య లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి పాల్వంచ రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ బి. సురేష్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తదుపరి పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ దర్యాప్తు చేపట్టి సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసి, అవసరమైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా కోర్టు మొత్తం 13 మంది సాక్షులను పరీక్షించింది. సమర్పించిన సాక్ష్యాధారాలు, వాంగ్మూలాల ఆధారంగా నిందితుడిపై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించిన న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ అంకిత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 13 : సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు సోమవారం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాకు వచ్చిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇల్లందు క్లబ్ ప్రాంగణం లోని సింగరేణి అతిథి గృహంలో జరిగిన ఈ భేటీలో కలెక్టర్ అంకిత్ జిల్లా యంత్రాంగం తరఫున కేంద్ర మంత్రికి మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో జరుగు తున్న అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై స్వల్పంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 15 నుండి పెద్దమ్మ తల్లి బోనాల జాతర

**- భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




గోదావరిఖని టౌన్, జూలై 13 : స్థానిక ఐబీ కాలనీలో వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆషాడ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ పేర్కొంది. ఈ మేరకు సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ గుర్రాల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రావుల స్వరాజ్ మాట్లాడుతూ పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ, నాగదేవత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 15 బుధవారం నుండి నెల రోజుల పాటు నిర్వహించనున్న ఆషాఢ మాసం శ్రీ పెద్దమ్మ తల్లి బోనాల జాతరలో ముదిరాజ్ కులస్తులు, బంధువులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి, అమ్మ వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరారు. భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఆలయ కమిటీ నాయకులు అప్పరాజు ప్రభాకర్, బర్ల మల్లయ్య, ఇస్తారి, శీలం శ్రీనివాస్, చిగురు సాయి, చొప్పరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పాల్వంచలో పలు కార్యక్రమాల్లో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూలై 13 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని పాత పాల్వంచలో సోమవారం నిర్వహించిన పలు అధికార, అభివృద్ధి కార్యక్రమాల్లో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అలాగే 46వ డివిజన్‌లోని 77, 78 పోలింగ్ కేంద్రాల ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) శిబిరాలను సందర్శించి కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో పాత పాల్వంచ ప్రాథమిక పాఠశాలలో నిర్వ హించిన ఉచిత కంటి పరీక్షల శిబిరంలో పాల్గొన్నారు. అదే పాఠ శాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు (జీవీఆర్), బీఎల్‌వోలు చంద్రార్కర్, రచ్చా వరుణ్, హైస్కూల్ హెచ్‌ఎం పద్మలత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం మమత, ఆర్‌పీలు అరుణ, నాగమణి, గ్రామస్థులు షేక్ ఖాజామియా, మసనం శరత్, సయ్యద్ కరీమ్, లోగాని రామకృష్ణ, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## అయిజ చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గానికి ఎన్నిక

**- ధృవీకరణ పత్రాల అందజేత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జోగులాంబ గద్వాల, జూలై 13 : అయిజ చేనేత సహకార సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన పాలకవర్గ సభ్యులకు ఎన్నిక ధృవీకరణ పత్రాలను మహబూబ్‌నగర్ అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్, అయిజ చేనేత సహకార సంఘ ఎన్నికల అధికారి వీరభద్రుడు అందజేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు డాన్ వీరన్న, ఉపాధ్యక్షుడు షర్ఫుద్దీన్, కార్యదర్శి (సెక్రెటరీ) పసలాది బసవరాజు, కోశాధికారి కస వెంకటేష్, డైరెక్టర్లు కర్రె రాజశేఖర్, కే.కొండ, అబ్దుల్ రియాజ్, శైలజ, మద్రాస్ లక్ష్మిలను ఆయన అభినందించారు. సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టు కుంటూ సంఘ అభివృద్ధి,చేనేత కార్మికుల సంక్షేమం కోసం అంకితభావంతో పని చేయాలని సూచించారు. ధృవీకరణ పత్రాలు అందుకున్న విజేతలు ఎన్నికల ప్రక్రియను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించిన ఎన్నికల అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి అంద రి సహకారంతో కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



## ఈశ్వరమ్మ యాదవ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**- లేకుంటే ఉద్యమం :: భారత యాదవ సమితి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూలై 13 : మహబూబాబాద్ జిల్లా భారత యాదవ సమితి నాయకులు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌ను ఉద్దేశించి జక్కిడి శివచరణ్ రెడ్డి చేసినట్లు ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. డోర్నకల్‌లోని యాదవ్ నగర్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దాసరి నాని యాదవ్ మాట్లాడుతూ, ప్రచారంలో ఉన్న ఆడియోపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పోచబోయిన ఈశ్వ రమ్మ యాదవ్‌తో పాటు యాదవ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. రాజకీయ భేదాలు ఉన్నా మహిళలను, సామా జిక వర్గాలను కించపరిచే వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పకపోతే యాదవ సంఘాలు, బీసీ సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధమైన ఆందో ళనలు చేపడతామని హెచ్చరించారు.

# సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సకాలంలో అప్‌డేట్ చేయాలి

**- మహిళలపై నేరాలు, గ్రేవ్ కేసుల్లో అలసత్వం వద్దు - పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి**
**- నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి**
**- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూలై 13 : విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు అధికారులతో అర్థ వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో సీసీటీఎన్ఎస్ 2.0 అప్లికేషన్ ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,కేసుల దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ కోసం సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలను పోలీస్ కమిషనర్ ఆన్‌లైన్ విధానంలో స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగ్ కేసుల పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు, సలహాలు, ఆదేశాలు జారీ చేశారు.ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న లాంగ్ పెండింగ్ కేసులు,పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించిన సీపీ, దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీపీ మాట్లాడుతూ, సీసీటీఎన్ఎస్ 2.0లో నమోదైన ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని నిర్దేశిత కాలపరిమితిలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్, ఎస్‌సీఆర్‌బీ నివేదికలు,ఎన్‌టీఆర్ ఫోటో డేటాబేస్‌తో పాటు ఇతర డిజిటల్ రికార్డులను నిరంతరం నవీకరించాలని, ఎస్‌హెచ్‌ఓలు కేసులకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిర్ణీత సమయంలో సిస్టమ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి దశను నిర్దేశిత సమయంలో అప్‌డేట్ చేయాలని తెలిపారు. అనవసరమైన లేదా తప్పుడు సమాచారాన్ని అప్‌లోడ్ చేయరాదని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో నమోదయ్యే ప్రతి కేసును గడువులోపు పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రాపర్టీ నేరాలు,చైన్ స్నాచింగ్ కేసుల్లో స్థానిక పోలీసులు,సీసీఎస్ బృందాలు సమన్వయంతో పనిచేసి నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మహిళలకు సంబంధించిన తీవ్రమైన కేసుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, చట్టపరంగా వెంటనే కేసు నమోదు చేసి సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నిందితుల అరెస్టులను ఆలస్యం చేయరాదని,గ్రేవ్ కేసులు,ఎన్‌డీపీఎస్ కేసులు,నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు,పెండింగ్‌లో ఉన్న కీలక నివేదికలను డీసీపీలు, ఏసీపీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.గంజాయి, అక్రమ ఇసుక రవాణా,పేకాట తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఆస్తి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాల కేసుల్లో ఆస్తుల గుర్తింపు,



స్వాధీనం, అటాచ్‌మెంట్ ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు,కేడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు,ప్రాపర్టీ అఫెండర్లపై ఎస్‌హెచ్‌ఓలకు పూర్తి సమాచారం ఉండాలని,వారి కదలికలు, కార్యకలాపాలు, ఎవరిని కలుస్తున్నారు, ఎవరితో సంబంధాలు కొనసాగిస్తున్నారు అనే అంశాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఫంక్షనల్ వర్టికల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని,పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది తమకు అప్పగించిన వర్టికల్స్‌లో అప్రమత్తంగా పనిచేస్తూ పరస్పర సమన్వయంతో మెరుగైన పనితీరు కనబరిస్తే రాష్ట్ర స్థాయిలో ఆయా పోలీస్ స్టేషన్లు, యూనిట్లకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో గౌరవంగా మాట్లాడాలని,వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో విచారణ చేసి న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలని సూచించారు. ఫిర్యాదులో క్రిమినల్ అంశాలు ఉన్నట్లయితే వెంటనే కేసు నమోదు చేయాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ నిర్వహించి, సాక్ష్యాలను నమోదు చేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ దేవాలయంతో సమానమని, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిర్ధారించి పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు.దర్యాప్తు ప్రక్రియను పూర్తిగా నమోదు చేసిన అనంతరమే తదుపరి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్‌కు ఎవరినీ అనవసరంగా పిలవరాదని,అరెస్టుల విషయంలో ఎస్‌ఓపీని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వవద్దని హెచ్చరించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ సి. హెచ్.శ్రీనివాస్,సీసీఎస్ ఏసిపిలు రవీందర్ ,ప్రవీణ్ కుమార్,టాస్క్ ఫోర్స్ ఎసిపి శ్రీనివాస్ రావు, ఏఆర్ ఎసిపిలు ప్రతాప్,రమేష్ సీఐలు, ఇన్స్ పెక్టర్లు, ఆర్.ఐ లు,ఎస్ఐలు పాల్గొన్నారు.

# తాత్కాలిక (టీఆర్) రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాల విక్రయం

**- షోరూం నిర్వాహకులకు రవాణా శాఖ అధికారుల నోటీసులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోరుట్ల, జూలై 13 : కోరుట్ల పట్టణంలోని పలు ద్విచక్ర వాహనాల షోరూంలలో రవాణా శాఖ అధికారులు సోమవారం రోజున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా రవాణాశాఖ అధికారి సంధాని మొహమ్మద్ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సి. హెచ్. రామారావు, ఎం.సాయి చరణ్ లు తమ సిబ్బందితో కలిసి షోరూంలను తనిఖీ చేశారు. తనిఖీల్లో కొన్ని షోరూంలు తాత్కాలిక (టీఆర్) రిజిస్ట్రేషన్ లేకుండానే ద్విచక్ర వాహనాలను విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించిన షోరూంల యాజమాన్యాలకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. వాహనాల విక్రయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ములుగు జిల్లా జూలై 13 : ములుగు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల లోని ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.సిద్ధార్థ రెడ్డి కోరారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.సిద్ధార్థ రెడ్డి ప్రారంభిం చారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మరియు బండారుపల్లి మోడల్ స్కూల్, ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని,బోధనలో సాంకేతిక అంశాలను జోడిస్తూ విద్యార్థు లకు ఆసక్తిని రేకెత్తించే విధంగా ఆహ్లాదకరమైన తరగతి వాతావరణం పెంపొందించే విధంగా,ఎటువంటి చర్యలు చేపట్టాలనే అంశంపై శిక్షణలో చర్చించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కోర్స్ కోఆర్డినేటర్ బూత్కూరి శ్యామ్ సుందర్ రెడ్డి,సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు సైకం శ్రీనివాస్ రెడ్డి, గుల్లపెల్లి సాంబయ్య,సంబంధిత సెంటర్ ఇన్చార్జ్ లు కన్నం వినోద్ కుమార్, గందె రమేష్,సింగారపు దేవకి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దళితుల స్మశాన వాటికకు రక్షణ కల్పించాలి

**గ్రామ దళితులు తహశీల్దార్‌కు వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూలై 13 : భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోని దళితుల (మాదిగ) స్మశాన వాటికను ఆక్రమణల నుంచి రక్షించి, అక్రమదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ దళితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం భువనగిరి మండల తహశీల్దార్ జగన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొండమడుగు సార్ నర్సింహ, కొండమడుగు రాములు మాట్లాడుతూ గ్రామంలో 100కు పైగా దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని, గత 200 సంవత్సరాలుగా సర్వే నంబర్ 285లోని రెండు ఎకరాలకు పైగా ఉన్న భూమిలో తమ పూర్వీకులకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2001లో అప్పటి ఎమ్మార్వో సర్వే నిర్వహించి 20 గుంటల భూమిని స్మశాన వాటికగా గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేసినప్పటికీ, ప్రస్తుతం ఆ భూమిలో కొంత భాగం ఆక్రమణకు గురైందని ఆరోపించారు. కొంతమంది రైతులు స్మశాన భూమిని కేవలం ఏడు గుంటలేనని తప్పుడు ప్రచారం చేస్తూ, సమాధులను ధ్వంసం చేయడంతో పాటు ప్రతి పంట కాలంలో కొంత భూమిని ఆక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల స్మశాన వాటికను ఆక్రమించడం, సమాధులను ధ్వంసం చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని



పేర్కొన్నారు. స్మశాన వాటికకు వెళ్లే దారిని కూడా అడ్డుకుంటున్నారని, ఇటువంటి ఘటనలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాల్సి ఉన్నా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే స్మశాన వాటికను సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని, ప్రహరీ గోడ లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, శాశ్వత రహదారి, స్నానాలకు నీటి సౌకర్యం, దింపుడు గల్లం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కొండమడుగు అశోక్‌తో పాటు కొండమడుగు చంద్రయ్య, పోశయ్య, రవి, సాయిలు, స్వామి, కుమార్, ప్రశాంత్, రామ నర్సింహ, కాసారం మల్లయ్య, వంటల స్వామి, పల్లెర్ల మల్లేశం, బూరుగు యాదగిరి, బోనగిరి బాలయ్య, గంధమల్ల బాలరాజు, పల్లెపాటి పాండు, కర్ణాకర్, కర్రె మధు, బుద్ధ విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి మరమ్మత్తు లేవి...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ జులై 13 : మండల పరిధిలోని గత 15 రోజుల నుండి మిషన్ భగీరథ త్రాగు నీటి కొరత ఉన్నందున్న త్రాగు నీటి కోసం పలు గ్రామాల్లో ప్రజలు గత 15 రోజుల నుండి మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తమ సొంత వ్యవసాయ క్షేత్రాలలోని బోరుల వద్ద రాత్రింబవలు నీటిని తెచ్చుకోవడం జరుగుతుంది.టేక్మాల్ నుండి ఎల్లుపెట్ మీదగా ఉన్న మిషన్ భగీరథ పైపు లైన్ వేల్పుగొండ గ్రామ పరదిలోని మొకచెరువు శివారు వద్ద పైప్ లైన్ పగిలి సుమారు 8 గ్రామాల ప్రజలకు నీటి సమస్య ఏర్పడింది. స్థానిక ప్రజలు అధికారులకు ఇట్టి విషయాన్ని తెలుపగా లీకేజీలను వారం రోజుల్లో బాగు చేయిస్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకు అధికారులు మాత్రం నిమ్మకు నీరుఎత్తనట్లు వ్యవహరిస్తున్నారు. ఓ పక్క జిల్లా కేంద్రంలోని ఉన్నత అధికారులు మిషన్ భగీరథ నీటి సమస్యలు ఏ ఒక్క గ్రామంలో రాకుండా మండల స్థాయి అధికారులు చూసుకోవాలని స్వయంగా జిల్లా కలెక్టర్ తెలుపగా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తున్నారు. ఇదిలా ఉండగా ఓ యువకుడు మిషన్ భగీరథ అధికారులకు పైప్ లైన్లీకేజీల వీడియోలు ఫోటోలు పెట్టి ఫోన్ చేయగా నీటి కొరతను త్వరలో తీరుస్తామని చెప్పడం జరిగింది కానీ ఇప్పటివరకు లీకేజీల మరమ్మత్తులు చేపట్టకపోవడం వల్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ గ్రామాలలో నీటి సమస్య ఏ విధంగా తీరుస్తారో వేచి చూడాల్సిందే...

# ఆ..సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లు చేయాలి



**- రిజిస్ట్రేషన్ల ఆపేయడం అర్థం లేని నిర్ణయం**
**- ఇష్టానుసారంగా సబ్ రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది తీరు**
**- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన రియాల్టర్లు, బిల్డర్లు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చెరు, జూలై 13 : స్వతంత్ర సమరయోధులు, సైనికులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ఏర్పాటు చేసిన డిటిసిపి, హెచ్ఎండిఏ లేఔట్లలో నిలిపివేసిన రిజిస్ట్రేషన్ లను వెంటనే అమలు జరపాలని కోరుతూ సోమవారం ఇస్నాపూర్ ప్రాంత బిల్డర్లు, రియాల్టర్లు సంగారెడ్డి లోని జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిల్డర్లు, రియాల్టర్లు మాట్లాడుతూ సంగారెడ్డి, పటాన్చెరు సబ్ రిజిస్టర్ కార్యాలయాల పరిధిలోని డిటిసిపి, హెచ్ఎండిఏ అనుమతులతో ఏర్పాటు చేసిన లేఔట్లలో రిజిస్ట్రేషన్లు ఏ విధంగా నిలిపివేస్తారని వారు ప్రశ్నించారు. అయితే సైనికులకు, స్వతంత్ర సమరయోధులకు ప్రభుత్వం గతంలో కేటాయించిన భూముల సర్వే నంబర్లు ప్రభుత్వ సర్వే నంబర్లై ఉంటాయని వారన్నారు. అయితే ఆ సర్వే నంబర్లలో అన్ని ప్రభుత్వ అనుమతులతోనే లేఅవుట్లు వేశారని, అయితే ఇప్పుడు అవి ప్రభుత్వ సర్వే నంబర్లు అన్న కారణంతో రిజిస్ట్రేషన్లు ఆపడం వల్లా బిల్డర్లు, రియాల్టర్లు తీవ్రంగా నష్టపోతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ నిలిపివేసిన రిజిస్ట్రేషన్ లను వెంటనే అమలు చేయాలని వారు కలెక్టర్ ను కోరారు. ఇస్నాపూర్ ప్రాంతంలో చాలా లేఔట్లలో ప్రభుత్వ సర్వే నంబర్లు ఉండడం వల్లా సుమారు ఐదు, ఆరు లేఔట్లలో రిజిస్ట్రేషన్ లను నిలిపివేసినట్లు కలెక్టర్ దృష్టికి వారు తీసుకెళ్లారు.

అంతేకాకుండా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎవరైనా రిజిస్ట్రేషన్ నిమిత్తం వెళితే రిజిస్ట్రేషన్లు నిలిపివేసి ఈ సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లు జరగవు. జిల్లా కలెక్టర్ ను కలవండి అంటూ సమాధానం చెబుతున్నట్లు వారు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా నిలిపివేసిన సర్వే నంబర్లలో వెంటనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో బిల్డర్లు, రియాల్టర్లు మహమ్మద్ ఇంతియాజ్, కే, వెంకటరావు, ఖలీల్, ఆదిరెడ్డి, ఆబేద్, సుదర్శన్ రెడ్డి, రాకేష్ యాదవ్, కృష్ణ, ప్రశాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం చర్యలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూలై 13 : జగిత్యాల రైతు బజార్ ముందు రహదారిపై రైతులు కూరగా యలు విక్రయించడం వల్ల గత కొంతకాలంగా తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ముఖ్యంగా విద్యానగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు, సమీపంలోని ఆసుపత్రులకు వెళ్లే రోగులు, అంబులెన్స్‌లు మరియు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం సోమ వారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ శ్రీమతి అరవ లక్ష్మి, మున్సిపల్ సిబ్బందితో కలిసి రైతు బజార్ ముందు రహదారిపై కూర్చొని వ్యాపారం చేస్తున్న రైతులను రైతు బజార్ లోపలికి వెళ్లి విక్రయాలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించి చర్యలు చేపట్టారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ రద్దీ తగ్గి, విద్యానగర్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి. ముఖ్యంగా సమీపంలోని ఆసుపత్రు లకు వెళ్లే రోగులు, అంబులెన్స్‌లు, ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కూడా పాల్గొని ట్రాఫిక్ పోలీసులకు సహకరించారు. రైతులు రహదారిపై కాకుండా రైతు బజార్ లోపలే వ్యాపారం నిర్వహించేలా సూచనలు చేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలు కాపాడడంతో పాటు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడటం అందరి బాధ్యత అని అన్నారు. రైతు బజార్‌లో నిజమైన రైతులకు సక్రమంగా స్థలాలు కల్పించి, రహదారులపై వ్యాపారాలు జరగకుండా సంబంధిత శాఖలు నిరంతరం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నా రు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశంను స్థానిక వార్డు ప్రజలు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలు కొనసాగించాలని కోరారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరిష్

**- కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి-విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూలై 13 : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేసముద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల ట్రైబల్ హాస్టల్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల లి1,32,641 మంది పిల్లలకులి 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,006 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల సహకారంతో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి, చదువుపై ఏకాగ్రత, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఇంటర్ విద్య జీవితానికి కీలకమని, పాఠశాల దశ నుంచే కెరీర్ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ప్రత్యేక కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని, గైర్హాజరయ్యే వారి తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకుంటానని హెచ్చరించారు. ఐఏఎస్ వంటి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే పట్టుదల, కృషి, ఏకాగ్రత అవసరమని విద్యార్థులకు వివరించారు.కళాశాల కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం, వసతుల్లో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తం, ఎంపీడీవో క్రాంతి, ప్రిన్సిపాల్ సుజాత, డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్, డాక్టర్ సుధీర్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శివకుమార్, రాజ్‌కుమార్, స్వామి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# “డ్రగ్స్‌కు నో చెప్పండి... భవిష్యత్తుకు యెస్ చెప్పండి”

**- విద్యార్థులతో అవగాహన సభ.. యాంటీ డ్రగ్ సోల్జర్లుగా యువతకు పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూలై 13 : మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారి వంటివని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని వనపర్తి డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వనపర్తి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ సునితారెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యార్థినుల భద్రత, మహిళల రక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పతకాలు, “యాంటీ డ్రగ్ సోల్జర్” సర్టిఫికెట్లు అందజేశారు. డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే విద్య, ఆరోగ్యం, వ్యక్తిత్వం, కుటుంబ బంధాలు దెబ్బతింటాయని హెచ్చరించారు.

# కేసముద్రంలో డీసీసీ బ్యాంకు, తాత్కాలిక ఫైర్ స్టేషన్ ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, జూలై 13 : కేసముద్రం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీ) శాఖతో పాటు తాత్కాలిక ఫైర్ స్టేషన్‌ను ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ డీజీ విక్రం సింగ్ మాన్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంయుక్తంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పురుషోత్తం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బానోతు సునీత, జిల్లా ఫైర్ అధికారి శ్రీనాథ్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, డీసీసీ బ్యాంకు రీజినల్ అధికారి చైతన్య, సీఈవో సుల్తాన్, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులు పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కేసముద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జూనియర్, డిగ్రీ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, కిచెన్, డైనింగ్ హాల్, పరిసరాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.



# సీఎం రేవంత్ రెడ్డి కొత్తకోట పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**- అధికారులతో కలెక్టర్ ఆదర్శ్ సురభి సమీక్ష**

**- విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూలై 13 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూలై 15న కొత్తకోటలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సోమవారం కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి తో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవంతో పాటు ముఖ్యమంత్రి విద్యార్థులతో నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమ వేదిక, బారికేడ్లు, సౌండ్ సిస్టమ్, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో జరిగే ముఖాముఖి కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని సాంకేతిక సదుపాయాలు సమర్థవంతంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే 9, 10వ తరగతి విద్యార్థులకు కూర్చునే ఏర్పాట్లు, కార్పెట్లు, తరగతి గదుల్లో ఫర్నిచర్, తాగునీరు, అల్పాహారం అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థుల రాకపోకలు, నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను నియమించి కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వీవీఐపీ రూట్, ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం అధికారులు సీఎం హెలికాప్టర్ దిగే హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. బారికేడ్లు, రహదారి ఏర్పాట్లు ఆర్అండ్‌బీ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పీ సీఈవో యాదయ్య, ఆర్అండ్‌బీ అధికారి దేశ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్, విద్యాశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# విలేజ్ డైరెక్టరీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూలై 13 : పాపులేషన్ సెన్సస్–2027లో భాగంగా ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించే విలేజ్ డైరెక్టరీ సర్వేను కచ్చితత్వంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ చిత్రా మిశ్రా సూచించారు. కలెక్టరేట్‌లోని ఎంసీఆర్‌హెచ్‌డీ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం ప్రారంభమైన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, పశువైద్య సేవలు తదితర మౌలిక వసతులకు సంబంధించిన తొమ్మిది విభాగాల సమాచారాన్ని పాపులేషన్ సెన్సస్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ వివరాలను తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి రాష్ట్ర సెన్సస్ శాఖ ద్వారా ఢిల్లీకి పంపించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపొందుతుందని చెప్పారు. జూలై 13 నుంచి 16 వరకు జరిగే శిక్షణలో 16 మండలాల గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మూడు మున్సిపాలిటీలు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రాందత్తా రెడ్డి, జిల్లా గణాంక అధికారి, అడిషనల్ డిస్ట్రిక్ట్ సెన్సస్ ఆఫీసర్ వెల్ది కిషన్ రావు, రాష్ట్ర సెన్సస్ అధికారులు తిరుపతి, శివప్రసాద్ రెడ్డి, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన ఘనత కిషన్ రెడ్డిదే

**- బీఎంఎస్ నాయకులు యాదగిరి సత్తయ్య, వడ్డెపల్లి కుమారస్వామి**

**- సింగరేణి భరోసా యాత్ర'ను విజయవంతం చేయాలని పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూలై 13 : తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను ఎలాంటి టెండర్ ప్రక్రియ లేకుండా సింగరేణి సంస్థకు కేటాయించేలా కృషి చేసి, సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడిన నాయకుడిగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నిలిచారని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి కుమారస్వామి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సింగరేణి సంస్థ, బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలపై ప్రత్యేకమైన ప్రేమ, బాధ్యతాభావం ఉందన్నారు. అందుకే తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను ఎలాంటి టెండర్లకు వెళ్లకుండా, అన్ని అనుమతుల క్లియరెన్స్ లతో నేరుగా సింగరేణి సంస్థకు కేటాయించేలా కేంద్ర స్థాయిలో కృషి చేశారని చెప్పారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, విస్తరణ కోసం కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని తాము బీఎంఎస్ తరపున కేంద్ర మంత్రులతో పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు తెలిపారు. ఎంఎండీఆర్ చట్టాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గతంలో తెలంగాణలో అధికారంలో ఉన్న ప్రభుత్వం టెండర్ల ద్వారా తమకు అనుకూలమైన సంస్థలకు బొగ్గు బ్లాకులు కేటాయించి, సింగరేణికి కొత్త బ్లాకులు రాకుండా చేసిందని ఆరోపించారు. అలాంటి వారే ఇప్పుడు కేంద్ర




ప్రభుత్వాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విమర్శించడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. గతంలో సింగరేణిలో 65 భూగర్భ గనులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 21కు తగ్గిపోయిందని, మరోవైపు 16 ఓపెన్‌కాస్ట్ గనులు ఏర్పడ్డాయని, కార్మికుల సంఖ్య తగ్గుతోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం, కొత్త ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాల అమలు, వారి సమస్యల పరిష్కారం కోసం కూడా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని తెలిపారు. తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయింపు నేపథ్యంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం ఉదయం 11 గంటలకు గోదావరిఖనికి రానున్నారని తెలిపారు. ఆయనకు ఓసీపీ–5 ప్రాజెక్టు వద్ద బీఎంఎస్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలకనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై సింగరేణి భరోసా యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ విలేకరుల సమావేశంలో బీఎంఎస్ సెంట్రల్ ట్రెజరర్ సాయవేణి సతీష్, నాయకులు పెండెం సత్యనారాయణ, బండారి శ్యాంసుందర్, శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బల్మూరి వనిత, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, జూలై 13 : ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 170 దరఖాస్తులురాగా, గృహ నిర్మాణ శాఖకు 59, కరీంనగర్ నగరపాలికకు 50దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పనులకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు నెలవారీ క్షేత్రస్థాయి పర్యటనల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగుపై చైతన్యపరచాలని, గ్రామాలు, వార్డుల్లో పారిశుద్ధ్యం, రోడ్లు, కల్వర్టుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, జూలై 13 : ఏడాది నుంచి 19 ఏండ్లలోపు వయసు పిల్లలు, విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగాహౌతంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఒక విద్యార్థిని జిల్లా కలెక్టర్ డ్రాయింగ్ వేయగా, ఆ విద్యార్థినిని సన్మానించి.. అభినందించారు. అనంతరం స్కూల్ ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంలో పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. కోడి గుడ్లు, పోషకాహారం ఇస్తున్నారా అని ఆరా తీశారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యాలయంలోని ఆట వస్తువులు, బాలామృతం ప్యాకెట్లు పరిశీలించారు. ఆట వస్తువులు వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అంగన్వాడీ ఆవరణను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాదికి రెండు సార్లు మాత్రలు వేస్తారని తెలిపారు. నులి పురుగుల నియంత్రణ కోసం మాత్రలు వేయాలని సూచించారు. దీంతో పిల్లలు వివిధ అనారోగ్య సమస్యల నుంచి బయట పడతారని తెలిపారు. అన్నం తినకముందు, తిన్న తర్వాత చేతులు కడుక్కోవాలని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్లు శుభ్రం చేసిన తర్వాత వినియోగించాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ పొన్నం లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వరి నారు తుంచి నాటు వేయాలి.. ఏవో రాంప్రసాద్


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ జులై 13 : టేక్మాల్ మండలంలోని బొడ్మట్ పల్లి లో సోమవారం వరి నాటు వేసే విధానాన్ని వ్యవసాయ అధికారి రాంప్రసాద్ పరిశీలించారు.వాతావరణ దృష్ట్యా గ్రామాల్లోని రైతులు వరి నాటు వేసే ముందు వరి కొనలను కచ్చితంగా తుంచాలన్నారు.వరి కొనలను తుంచితే చీడపీడ పురుగులు ఆశించకుండా పంట త్వరగా ఎదుగుతుందన్నారు. పంట ఎదుగుదలతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పురుగుల ఉధృష్టి తగ్గుతుందని తెలిపారు. రైతులు బోర్ల వద్ద నీరూ సరిపడా ఉన్నంత మేరకే నాటు వేసుకోవాలని సూచించారు.ఇష్టానుసారంగా మందులను పిచికారి చేయకుండా ఉదయం సాయంత్రం వేళలో పిచికారి చేయాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేయాలని ఆయన తెలిపారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 29 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, జూలై 13 : ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 29 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఒక యుద్ధం లాంటింది

**- అందరూ సైనికుల్లా పని చేయాలి**

**- తెలంగాణ సాంస్కృతిక కార్పొరేషన్ చైర్మన్ వెన్నెల గద్దర్**

**- సర్ ప్రక్రియ వేగవంతం కోసం బిఎల్ఏలకు,**

**- నాయకులకు దిశా నిర్దేశం చేసిన జగ్గారెడ్డి, నిర్మల**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సంగారెడ్డి జులై 12 : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనేది ఒక యుద్ధం లాంటిదని, దీన్ని ఎదుర్కొనేందుకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుని లాగా పోరాడాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ కార్పొరేషన్ చైర్ పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ , ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమగ్ర సవరణ పై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బిఎల్వోలు మీ దగ్గరకు రాకున్నా మీరే వెళ్లాలని బిఎల్ఏ లు, నాయకులకు సూచించారు. ఓట్ నమోదు కాకపోతే వ్యక్తిగతంగా ఓటర్ కే నష్టం కాబట్టి ఓటర్ లు కూడా తమ ఓటహక్కును నమోదు చేసుకోవాలనే ఆతృత, ఆసక్తి ఉండాలన్నారు. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రానున్న ఐదురోజుల్లోనే సర్ ప్రక్రియ పూర్తి అయ్యేలా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ పని మనది, మన సంగారెడ్డి కోసం పని చేస్తున్నామనే విషయాన్ని దృష్టి లో పెట్టుకుని పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ లు కూన వనితా సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, నాయకులు కూన సంతోష్, షఫీ హఫీజ్, పాల్గొన్నారు.

# వేంసూరుకు చేరిన గోదావరి జలాలు.. అన్నదాతల్లో వెల్లివిరిసిన ఆనందం

**-మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగునీరు**

**-కుంచపర్తి రెగ్యులేటర్ వద్ద సంబరాలు.. గోదావరి జలాలకు రైతుల ప్రత్యేక పూజలు**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, జూలై 13 : ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో ఆందోళన చెందుతున్న వేంసూరు మండల రైతులకు గోదావరి జలాల రాక ఊరటనిచ్చింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సోమవారం గోదావరి జలాలు వేంసూరు మండలానికి చేరుకోవడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో గోదావరి జలాలను ఈ ప్రాంతానికి తీసుకురావడంతో ఖరీఫ్ సాగుపై నెలకొన్న ఆందోళనలు తొలగి రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. సాగునీరు అందుబాటులోకి రావడంతో పంటల సాగుకు భరోసా లభించిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. గోదావరి జలాల రాక సందర్భంగా వేంసూరు మండలంలోని కుంచపర్తి రెగ్యులేటర్ వద్ద రైతులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కాల్వలో ప్రవహిస్తున్న గోదావరి జలాలకు పూలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. "జయహో తుమ్మల", "రైతు బాంధవుడు తుమ్మల" అంటూ రైతులు చేసిన నినాదాలతో కుంచపర్తి రెగ్యులేటర్ పరిసరాలు మార్మోగాయి. కాల్వలో పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలను చూసి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక ఖరీఫ్ సాగు ఎలా సాగుతుందోనని ఆందోళన చెందామని, ఇలాంటి సమయంలో గోదావరి జలాలను తీసుకురావడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చూపిన చొరవ తమకు ఎంతో భరోసానిచ్చిందని రైతులు తెలిపారు. "కాల్వలో గోదావరి నీటిని చూస్తుంటే మా పొలాలకు మళ్లీ జీవం వచ్చినట్టుగా ఉంది. రైతుల కష్టాలను గుర్తించి సాగునీరు అందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రుణపడి ఉంటాం" అంటూ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. గోదావరి జలాల రాకతో వేంసూరు మండల వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనగా, అన్నదాతల ముఖాల్లో మళ్లీ ఆశలు, ఆనందం వెల్లివిరిసింది.

# మణుగూరు ఏరియాలో తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ విజయోత్సవాలు

**- సింగరేణి భవిష్యత్తుకు చారిత్రాత్మక మైలురాయి: జీఎం దుర్గం రామచందర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూలై 13:తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించిన సందర్భంగా మణుగూరు ఏరియాలోని పీకేఓసీ––2 సైట్ కార్యాలయంలో సోమవారం విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాదాపు 13 సంవత్సరాల నిరీక్షణ అనంతరం 2013లో కేటాయించిన తాడిచర్ల––×× బ్లాక్ సింగరేణికి లభించడం సింగరేణి చరిత్రలో చారిత్రాత్మక విజయమన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి ఈ లీజు సాధించారని తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గని తర్వాత తాడిచర్ల–2 బ్లాక్ లభించడం సింగరేణి విస్తరణలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. 18.75 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఈ బ్లాక్‌లో 434 మిలియన్ టన్నుల భౌగోళిక బొగ్గు నిల్వలు ఉండగా, అందులో 340 మిలియన్ టన్నులు వెలికితీతకు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల జీ––9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేసి సుమారు 45 సంవత్సరాల పాటు గని కార్యకలాపాలు కొనసాగించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించడంతో పాటు ఏటా రూ.2,500 కోట్ల టర్నోవర్ సాధించే సామర్థ్యం ఉందని వివరించారు. ప్రస్తుతం పీకేఓసీ––2 ప్రాజెక్టు ఆయుష్షు మరో 4––5 సంవత్సరాలు మాత్రమే ఉందని, పీకేఓసీ–2 డీప్ సైడ్ విస్తరణ బ్లాక్ వేలంలో సింగరేణి పోటీపడుతోందని తెలిపారు. ఆ బ్లాక్ లభిస్తే ప్రాజెక్టు కార్యకాలం మరో 20 సంవత్సరాలు పొడిగించబడటంతో పాటు మణుగూరు ప్రాంతంలో బొగ్గు ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని చెప్పారు. అంతర్జాతీయ పోటీని ఎదుర్కొనేందుకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ అధిక సామర్థ్యంతో పనిచేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులకు పంపిన ప్రత్యేక సందేశంతో కూడిన కరపత్రాలను పంపిణీ చేసి చదివి వినిపించారు. అనంతరం అన్ని గనులు, విభాగాల్లో స్వీట్లు పంపిణీ చేసి విజయోత్సవాలు నిర్వహించారు.

# కాంట్రాక్ట్ కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

**మద్దెల శ్రీనివాస్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, జూలై 13 : సింగరేణి ఆర్జీ–1 బంగ్లాస్ ఏరియా పార్కులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ ఆరోపించారు. కార్మికులకు కేటాయించిన శాశ్వత పని ప్రదేశాలకు బదులుగా సింగరేణి అటవీశాఖ అధికారులు ఇతర ప్రాంతాల్లో పనులు చేయిస్తూ తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ప్రమాదకరమైన శ్మశానవాటిక ప్రాంతంలో చెట్ల చుట్టూ గడ్డి, కలుపు తొలగించే పనులు రక్షణ పరికరాలు లేకుండానే చేయిస్తున్నారని, బూట్లు, గ్లౌజులు వంటి భద్రతా సామగ్రి అందించకుండా కార్మికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని అన్నారు. అధికారులు చెప్పిన పనులు చేయకపోతే విధులకు రావద్దు అంటూ బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు. సింగరేణి యాజమాన్యం, ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ పరికరాలు అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం వారికి కేటాయించిన శాశ్వత పని ప్రదేశాల్లోనే విధులు కల్పించాలని, ఫారెస్ట్ అధికారుల వేధింపులను అరికట్టాలని మద్దెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# ఆరోగ్యం



## ఈ సింపుల్ టిప్స్‌తో ఎలాంటి తలనొప్పినైనా క్షణాల్లోనే తగ్గించుకోవచ్చు

తలనొప్పి అనేది చాలా మందికి ఎదురయ్యే సాధారణ సమస్య. కానీ అది వచ్చినపుడు ఆ బాధను చాలా ఇబ్బంది కలిగిస్తుంది. తలనొప్పి అనేక కారణాలతో వస్తుంది. అయితే, ఆకస్మికంగా వచ్చే తలనొప్పిని కొంత వరకు ఇంటి చికిత్సలతో తగ్గించుకోవచ్చు. కొన్ని సార్లు, మందుల అవసరం లేకుండా కొన్ని సహజమైన పద్దతిలో ఈ తలనొప్పిని తగ్గించుకోవచ్చు. అయితే ఈ స్టోరీలో ఎలాంటి చిట్కాలతో తలనొప్పిని ఇంట్లోనే తగ్గించుకోవచ్చు. ఏ విధంగా ఈ చిట్కాలు పాటించాలి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

అల్లం అకస్మాత్తుగా తలనొప్పి వస్తే, అల్లం సహాయపడుతుంది. అల్లం రక్త నాళాలలో వాపును తగ్గించి నొప్పిని నిర్వారిస్తుంది. అల్లం రసం మరియు నిమ్మరసం సమానంగా తీసుకొని కలిపి తాగడం వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం ఎసెన్స్ ఉన్న మిఠాయిలను తినడం లేదా అల్లం నీటిలో మరిగించి తాగడం కూడా మంచి ఫలితాలు వస్తాయి. అలాగే దాల్చిన చెక్క కూడా తలనొప్పి తగ్గించడంలో సహాయపడుతుంది. దాల్చిన 30 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేయడం వల్ల తలనొప్పి తగ్గుతుంది.

లవంగాలు: లవంగాలు కూడా తలనొప్పి నుంచి ఉపశమనం ఇచ్చే మంచి పరిష్కారం అని చెప్పొచ్చు. కొన్ని లవంగాలను శుభ్రమైన గుడ్డలో కట్టి, వాటిని వాసన చూస్తూ ఉంచడం ద్వారా నొప్పి తగ్గుతుంది. మల్లెపూలు కూడా తలనొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. జాస్మిన్ పువ్వుల టీ తాగడం తలనొప్పిని తగ్గించుకోవడానికి మంచి మార్గం. ఈ టీకి తేనె కలిపి తాగితే, రుచి కూడా బాగా ఉంటుంది, తలనొప్పి తగ్గుతుంది. ఈ సహజ పద్ధతులు ఆకస్మిక తలనొప్పిని తగ్గించడంలో ఎంతగానో సహాయపడతాయి.

## మధురై స్పెషల్ పులిహోర..

మనదేశంలోని చాలా టెంపుల్స్ లో ప్రసాదంగా పులిహోర అందిస్తారు. అయితే తమిళనాడు రాష్ట్రంలోని మధురైలోని ఫేమస్ మీనాక్షీసుందరేశ్వర్ ఆలయంలో ప్రసాదంగా ఇచ్చే పులిహోర టేస్ట్ మాత్రం నెక్స్ట్ లెవల్లో ఉంటుంది. ఇలాంటి పులిహోర ఇదివరకెప్పుడూ తినలేదు అనిపించడం పక్కా. అంత కమ్మగా ఉంటుంది. దీనిని మీ ఇంట్లోనే తయారుచేసుకోవాలంటే ఏమేం పదార్థాలు కావాలి, తయారీ విధానం ఇక్కడ చూడండి.

మధురై స్పెషల్ పులిహోర తయారీకి కావాల్సిన పదార్థాలు బియ్యం–400 గ్రాములు చింతపండు–80 గ్రాములు వేరుశెనగపప్పు–అర కప్పు మెంతులు–1 టీస్పూన్ ధనియాలు– 1 టేబుల్ స్పూన్ నల్ల నువ్వులు– 1 టేబుల్ స్పూన్ మిరియాలు– 1 టేబుల్ స్పూన్ నువ్వుల నూనె ఎండుమిర్చి–7 ఆవాలు–అర టేబుల్ స్పూన్ మినపగుళు – 1 టేబుల్ స్పూన్ పచ్చి శెనగపప్పు–1 టేబుల్ స్పూన్ ఉప్పు–1 టేబుల్ స్పూన్ పసుపు–పావు టీస్పూన్ ఇంగువ–1టీస్పూన్ కరివేపాకు.





మధురై స్పెషల్ పులిహోర తయారీ విధానం –ముందుగా రెండు కప్పుల బియ్యం శుభ్రంగా కడిగి కుక్కర్ లో వేసి ఇందులో నాలుగు కప్పుల నీళ్లు పోసి 1 గంటసేపు నానబెట్టండి. –తర్వాత అందులో స్పూన్ ఆయిల్ వేసి మూతపెట్టి మీడియం మంట మీద మూడు విజిల్స్ వచ్చేదాకా ఉడికించుకోండి. –తర్వాత చింతపండుని ఓ బౌల్ లో వేసి అందులో వేడినీళ్లు పోసి అరగంట సేపు నానబెట్టండి. –అరగంట తర్వాత చేతిలో గుజ్జు అంతా పిండుకొని ఓ జాలిపెట్టి వడకట్టుకోవాలి. చింతపండు గుజ్జు మరీ పలుచగా ఉండకూడదు,మరీ చిక్కగా ఉండకూడదు. –తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో నూనె లేకుండానే పల్లీలు వేయించి పక్కనపెట్టుకోండి. పూర్తిగా చల్లారిన తర్వాత పొట్టు తీసేసి ఉంచండి.

–ఇప్పుడు అదేపాన్ లో 1 టీస్పూన్ మెంతులు వేసి సగం వరకు వేగిన తర్వాత ఇందులోనే మిరియాలు, ధనియాలు, నల్ల నువ్వులు వేసి వేయించి ఓ గిన్నెలోకి తీసుకొని పక్కనపెట్టుకోవాలి. –ఇప్పుడు స్టవ్ మీద పాన్ లో 6 టేబుల్ స్పూన్ల నువ్వుల నూనె వేడిచేసి అందులో ఎండుమిర్చి వేయించి పక్కనపెట్టుకోండి. ఇప్పుడు అదే నూనెలో మినపగుళ్లు, ఆవాలు, పచ్చిశెనగపప్పు వేసి వేయించి అందులో రెండు ఎండుమిర్చిలను తుంపి ముక్కలు, రెండు రెబ్బల కరివేపాకు వేసి స్టవ్ ఆఫ్ చేసేయండి. ఈ మొత్తాన్ని ఆయిల్ తో సహా తీసి ఓ బౌల్ లో వేసి పెట్టుకోండి. –ఇప్పుడు అదే పాన్ లో పక్కన ఉంచుకున్న చింతపండు గుజ్జు మొత్తం పోసేయండి. ఇందులో ఉప్పు,పసుపు, 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ వేసి మధ్య మధ్యలో కలుపుకుంటూ అది కొంచెం చిక్కబడేంత వరకు మీడియం మంట మీద ఉడికించుకోవాలి. –ఇప్పుడు మిక్సీ గిన్నెలో వేయించిన ఎండుమిర్చి వేసి కొంచెం బరకగా గ్రైండ్ చేసి ఈ పొడిని ఓ గిన్నెలోకి తీసుకొని పక్కన ఉంచుకోండి. –తర్వాత మిక్సీగిన్నెలో వేయించిన ధనియాలు, మెంతులు, నువ్వులు, మిరియాలను వేసి వాటిని మెత్తగా గ్రైండ్ చేసి గిన్నెలోకి తీసుకొని పక్కనపెట్టుకోండి. –తర్వాత ఉడికించిన అన్నాన్ని పులిహోర కలిపే పల్లెంలో వేసి అందులోనే రెండు రెమ్మల కరివేపాకు, వేయించి పొట్టు తీసిన పల్లీలు వేసి బాగా కలిసేలా కలుపి కొంచెం చల్లారనివ్వాలి. –తర్వాత చింతపండు గుజ్జు ఉడికిన తర్వాత అందులో గ్రైండ్ చేసి గిన్నెల్లో ఉంచిన పొడులు, ఇంగువ కూడా వేసి కలపాలి. తర్వాత ఇందులో ముందుగా గిన్నెలో రెడీ చేసి ఉంచి పోపును కూడా చింతపండు గుజ్జులో వేసి కలిపి ఆయిల్ సపరేట్ అయ్యి పైకి తేలేంతవరకు ఉడికించుకోవాలి. –తర్వాత దీన్ని అన్నంలో వేసి కలపడమే. అంతే మధురై స్పెషల్ పులిహోర రెడీ.




## ఇలాంటి పచ్చడి మీరు జీవితంలో తిని ఉండరు

నువ్వులు ఆరోగ్యానికి చాలా మంచిదన్న విషయం తెలిసిందే. ఈ నువ్వులతో చేసే నూనె దేవుడికి నైవేద్యానికి కూడా సమర్పిస్తారు. నువ్వులను వివిధ రకాల స్వీట్స్ చేసుకోవడంతో పాటు పలు వంటల్లో కూడా వినియోగిస్తారు. అయితే ఈ నువ్వులతో చేసుకునే పచ్చడి మాత్రం వేరే లెవెల్‌లో ఉంటుంది. ఆరోగ్య ప్రయోజనాలతో పాటు అద్భుతమైన రుచి ఉంటుంది. దీనిని ఎలా చేసుకోవాలి? కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

నువ్వుల పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు నువ్వులు – 1 కప్పు ఎండు మిర్చి – 5–6 (మీ రుచికి తగినట్లు) చింతపండు – చిన్న ముద్ద వెల్లుల్లి రెబ్బలు – 4–5 జీలకర్ర – 1/2 టీస్పూన్ ఆవాలు – 1/2 టీస్పూన్ నూనె – 2 టేబుల్ స్పూన్లు ఉప్పు – రుచికి తగినంత.



నువ్వుల పచ్చడి తయారీ విధానం: ముందుగా, నువ్వులను ఒక పాన్‌లో వేసి దోరగా వేయించుకోవాలి. అవి చిటపటలాడే వరకు వేయించాలి, కానీ మాడిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. అలా వేయించిన నువ్వులను ఒక ప్లేట్‌లో తీసుకొని చల్లారనివ్వాలి. ఇప్పుడు ఎండు మిర్చిని కూడా అదే పాన్‌లో కొద్దిగా నూనె వేసి వేయించుకోవాలి. అలాగే చింతపండును కొద్దిగా నీటిలో నానబెట్టాలి. ఆ తరువాత వేయించిన నువ్వులు, ఎండు మిర్చి, చింతపండు, వెల్లుల్లి రెబ్బలు, జీలకర్ర, ఉప్పు వేసి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీరు కూడా కలుపుకోవచ్చు. ఇప్పుడు ఒక చిన్న పాన్‌లో నూనె వేసి ఆవాలు వేయాలి. ఆవాలు చిటపటలాడిన తర్వాత ఈ తాలింపును పచ్చడిలో కలపాలి. అంతే ఎంతో రుచికరమైన, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే నువ్వుల పచ్చడి సిద్ధమైనట్లే.

## సమ్మర్ స్పెషల్.. ఇంట్లోనే రోజ్ మిల్క్



ప్రస్తుతం ఉదయం నుంచే భానుడి భగభగలు మొదలవుతున్నాయి. సమ్మర్ లో చాలామంది ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు చల్లగా ఏదైనా కూల్ డ్రింక్ ని తాగుతుంటారు. అయితే రోజ్ మిల్క్..సమ్మర్ లో తాగడానికి బెస్ట్ డ్రింక్. మిట్టమధ్యాహ్నం ఓ పక్క ఎర్రటి ఎండ..మరోపక్క చల్లటి రోజ్ మిల్క్ తాగుతుంటే ఈ జీవితానికి ఇంతకుమించి ఏం కావాలి అనిపిస్తుంది. చాలామంది సమ్మర్ లో షాపుల దగ్గరకు వెళ్లి రోజ్ మిల్క్ కొనుక్కోని తాగుతుంటారు. అయితే దీనిని ఇంట్లోనే చాలా ఈజీగా 5 నిమిషాల్లోనే తయారు చేసుకోవచ్చు. రోజ్ మిల్క్ తయారీకి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

రోజ్ మిల్క్ తయారీకి కావాల్సిన పదార్థాలు –పాలు –సబ్జా గింజలు –రోజ్ వాటర్ –రోజ్ సిరప్ –ఐస్ క్యూబ్స్ –గులాబీ రేకులు –చక్కెర

రోజ్ మిల్క్ తయారీ విధానం –ముందుగా అరలీటరు చిక్కటి పాలను కాచి చల్లార్చి ఫ్రిడ్జ్ లో పెట్టండి. –తర్వాత రెండు టేబుల్ స్పూన్ల సబ్జా గింజలు నానబెట్టండి. –కొద్దిసేపటి తర్వాత ఓ పెద్ద గ్లాస్ లేదా బెంబులో ఫ్రిడ్జ్ లో పెట్టిన పాలను పోసి ఇందులో 1 టీస్పూన్ రోజ్ వాటర్, 2 టేబుల్ స్పూన్ల చక్కెర, పావు కప్పు రోజ్ సిరప్, నాలుగైదు ఐస్ క్యూబ్ లు,నాలుగైదు గులాబీ రేకులు, నానబెట్టిన సబ్జా గింజలు వేసి మూతపెట్టి 3 నిమిషాలు బాగా షేక్ చేయండి. –తర్వాత మూత తీస్తే క్రీమీగా రోజ్ మిల్క్ రెడీ. దీన్ని తాగితే అబ్బా ఏముంది అని తీరాల్సిందే.

## కొల్హాపురి ఎగ్ కర్రీ



గుడ్డుతో మన దేశంలో ఎన్నో రకాల వంటకాలు చేస్తుంటారు. ఆమ్లెట్, గుడ్డు పులుసు, ఎగ్ బుర్జీ ఇలా ఎన్నో రకాల వంటలు ఉంటాయి. వాటిలో అత్యంత రుచికరమైనది, అలాగే అత్యంత ప్రజాదరణ పొందిన వాటిలో కొల్హాపురి ఎగ్ కర్రీ కూడా ఒకటి. మహారాష్ట్రలోని కొల్హాపుర్ ప్రాంతంలో దీనిని తయారు చేస్తారు. సుగంధ ద్రవ్యాలతో తయారు చేయబడే ఒక రుచికరమైన కూరను చపాతీతో లేదా అన్నంతో కలిపి తింటే రుచి మాత్రం వేరే లెవెల్‌లో ఉంటుంది. కానీ దీనిని ఎలా చేసుకోవాలో మీకు అర్ధం కావడం లేదు కదా? అందుకే ఈ స్టోరీని పూర్తిగా చదివి ఈ కొల్హాపురి స్టైల్ ఎగ్ కర్రీ ఎలా చేసుకోవాలో తెలుసుకోండి.

**కొల్హాపురి ఎగ్ కర్రీ చేయడానికి కావలసిన పదార్థాలు:**6 గుడ్లు 2 ఉల్లిపాయలు 1 టమోటా 1 అల్లం వెల్లుల్లి పేస్ట్ 1 టీస్పూన్ గరం మసాలా 1 టీస్పూన్ ధనియాల పొడి 1/2 టీస్పూన్ పసుపు 1/2 టీస్పూన్ కారం పొడి 1/4 టీస్పూన్ జీలకర్ర పొడి 1/4 టీస్పూన్ ఆవాలు 1/4 టీస్పూన్ మెంతులు 2 టేబుల్ స్పూన్లు నూనె రుచికి తగినంత ఉప్పు కొత్తిమీర తరుగు (గార్నిష్ కోసం) కొల్హాపురి ఎగ్ కర్రీ తయారీ విధానం: ముందుగా గుడ్లను ఉడకబెట్టి, వాటిని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఉల్లిపాయలు, టమోటాలను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆ తరువాత ఒక పాన్ తీసుకోవాలి. అందులో నూనె పోసుకొని వేడి చేసుకోవాలి. అందులో ఆవాలు, జీలకర్ర మరియు మెంతులు వేసి వేయించాలి. . తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. దాని తదనంతరం అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు వేయించాలి. అలాగే టమోటా ముక్కలు వేసుకొని అవి మెత్తగా అయ్యేవరకు వేయించాలి.

తరువాత అందులోనే గరం మసాలా, ధనియాల పొడి, పసుపు, కారం పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. కొద్దిగా నీరు పోసి మసాలాను కొన్ని నిమిషాల పాటు ఉడకనివ్వాలి. ఆ తరువాత ఆ మిశ్రమంలో ఉడికించిన గుడ్లను సగానికి కట్ చేసి కూరలో వేయాలి. ఓసారి రుచి చూసుకొని, రుచికి సరిపడా ఉప్పు వేసుకొని కూరను మరో రెండు నిమిషాల పాటు ఉడకనివ్వాలి.

# సినిమా న్యూస్



# బాహుబలి 3 వస్తుందా? నిర్మాత మౌనం దేనికి సంకేతం?



బాహుబలి3 ఎప్పుడు వస్తుంది? గత కొన్ని సంవత్సరాలుగా భారతీయ సినీ అభిమానులు అత్యధికంగా అడుగుతున్న ప్రశ్నల్లో ఇదొకటి. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి ఫ్రాంచైజీ భారతీయ సినీ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని రాసిన తర్వాత మూడో భాగంపై ఊహాగానాలు ఎప్పుడూ ఆగలేదు. తాజాగా జరిగిన ఓ విషయం ఈ డిస్కషన్ ను మరోసారి హాట్ టాపిక్‌గా మార్చింది. రీసెంట్ గా జరిగిన ఓ మూవీ టీజర్ లాంచ్ కార్యక్రమంలో నిర్మాత శోభు యార్లగడ్డ, రాజమౌళి కొడుకు కార్తికేయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంకర్ సుమ డైరెక్ట్ గా బాహుబలి3 షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందని ప్రశ్నించారు. అయితే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా స్టేజ్‌పై లైట్స్, సౌండ్ ఎఫెక్ట్స్‌తో సరదాగా సైలెంట్ మోమెంట్ క్రియేట్ చేయడం అక్కడున్న వారిని నవ్వించింది. కానీ ఆ మౌనం మాత్రం అభిమానుల్లో మరోసారి ఆసక్తిని పెంచింది. సమాధానం చెప్పకుండా దాటవేయడం వెనుక ఏదైనా ప్లానింగ్ ఉందా? లేక కేవలం సరదా కోసమే అలా చేశారా? అనే చర్చ సోషల్ మీడియాలో కొనసాగుతోంది. రీసెంట్ గా నెట్‌ఫ్లిక్స్‌లో బాహుబలి: ది టార్చ్ బేరర్ డాక్యుమెంటరీ ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టి కలిసి పాల్గొన్న సంభాషణలో బాహుబలి ప్రపంచం ఇంకా కంటిన్యూ అవుతుందనేలా కామెంట్స్ చేశారు. ముఖ్యంగా సరదా సంభాషణ మధ్య ప్రభాస్ మూడు వేళ్లు చూపిస్తూ చేసిన సైగ, రానా చేసిన కామెంట్స్ అభిమానుల్లో మూడో భాగంపై కొత్త ఆశలను రేకెత్తించాయి. చివర్లో కనిపించిన ది లెగసీ కంటిన్యూస్ అనే మెసేజ్ కూడా డిస్కషన్ కు మరింత ఊతమిచ్చింది. అయితే ఈ అన్ని పరిణామాల మధ్య ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. బాహుబలి3 పై ఆడియన్స్ లో ఎంతటి ఉత్సాహం ఉన్నా, ఇప్పటివరకు డైరెక్టర్ రాజమౌళి గానీ, నిర్మాత శోభు యార్లగడ్డ గానీ అఫీషియల్ గా బాహుబలి మూడో భాగాన్ని అనౌన్స్ చేయలేదు. తాజాగా స్టేజ్ పైన కూడా ఈ ప్రశ్నకు నిర్మాత రెస్పాండ్ అవకుండా మౌనం పాటించడం కూడా పలు అనుమానాలకు దారి తీస్తోంది. ప్రస్తుతం రాజమౌళి తన తర్వాతి భారీ ప్రాజెక్టైన వారణాసితో బిజీగా ఉండగా, ప్రభాస్ కూడా వరుస పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బాహుబలి3 ఎప్పుడు ప్రారంభమవుతుంది? అది ఫుల్ లెంగ్త్ సినిమా రూపంలో వస్తుందా? లేక ఫ్రాంచైజీని విస్తరించే మరో ప్రత్యేక ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటుందా? అన్న ప్రశ్నలకు సమాధానం రావాలంటే కచ్చితంగా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది బాహుబలి పేరు వినిపించిన ప్రతిసారీ అభిమానుల్లో అదే ఉత్సాహం ఇప్పటికీ ఏమాత్రం తగ్గలేదు.

# సమంతపై ఒత్తిడి ఈసారి ఇంకా కష్టం!



సమంత కెరీర్‌లో –మా ఇంటి బంగారం– విజయం మైలురాయిగా నిలిచిపోతుందన్నది కాదనలేని నిజం. ఈ లేడీ ఓరియేంటెడ్ చిత్రం బాక్సా ఫీస్ వద్ద వంద కోట్ల వసూళ్లను సాధించడం తో? సమంత సత్తా మరోసారి చాటుకుంది. సోలో హీరోయిన్‌గా ఈ స్థాయి విజయాన్ని అందుకోవడం అంటే? ఆమె తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నాయికల సరసన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడమే కాకుండా తనకంటూ బలమైన, ప్రత్యేకమైన మార్కెట్‌ను సృష్టించుకుందని చెప్పొచ్చు. అయితే ఈ విజయం సమంతపై ఓ కొత్త రకమైన ఒత్తిడిని తీసుకొస్తుందన్నది అంతే వాస్తవం. వంద కోట్ల క్లబ్‌లో చేరడం అంటే? ఇకపై ప్రతి సినిమాకు అదే తరహా అంచనాలు ఉంటాయని అర్థం. ప్రేక్షకులు , నిర్మాతలు సామ్ నుండి మరింత ప్రతిభను, విభిన్నమైన కథలను ఆశిస్తారు. ఈ అంచనాలను నిలబెట్టుకోవాలనే ఒత్తిడి, ఏ నటి కైనా సహజం. ఈ క్రమంలో సమంత తదుపరి ప్రాజెక్టుల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో సమంత ఎంచుకున్న ప్రయోగాత్మక చిత్రాలు అమ్మడికి మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. కానీ ఇప్పుడు ఒక కమర్షియల్ స్టార్‌గా మారిన నేపథ్యంలో కథల ఎంపికలో సమతుల్యత పాటించడం సవాలుగా మారుతుందన్నది అంతే వాస్తవం. భారీ బడ్జెట్ సినిమాలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూనే బాక్సాఫీస్ వద్ద నిలకడైన వసూళ్లను సాధించాల్సిన బాధ్యత సామపై ఉంది. ఒక్కో అడుగు ఆచితూచి వేయాల్సిన సమయం ఇది. ఎందుకంటే? సమంతను కోట్ల రూపాయలు నిర్మాత ఖర్చు చేస్తున్నప్పుడు ఆ నమ్మకాన్ని రెండింతలు నిలబెట్టాలి. కెరీర్ పరంగా సమంత వ్యక్తిగత నిర్ణయాలను కూడా మరింత బాధ్యతాయుతంగా తీసుకోవలసి ఉంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథానాయికగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్న సమంత ఈ విజయాన్ని అదృష్టంగా కాకుండా తన శ్రమకు దక్కిన ప్రతిఫలంగా భావిస్తోంది. ఈ క్రేజ్‌ను కొనసాగించడానికి తన ఫిట్‌నెస్, నటన , స్క్రిప్ట్ సెలక్షన్‌లో ఎప్పటికప్పుడు కొత్త మార్పులు చేస్తూనే ఉండాలి. ప్రస్తుత పోటీలో సమంత స్థానం సుస్థిరమైనదే అయినా? తదుపరి చిత్రాలు కూడా అదే స్థాయిలో ప్రేక్షకులను మెప్పించకపోతే? విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి సామ్ ఎంచుకునే కథలు కేవలం సోలో హీరోయిన్‌గా ఆమె ఇమేజ్‌ను పెంచేవిగానే కాకుండా? కంటెంట్ పరంగా కూడా బలంగా ఉండాలి. నిర్మాతలు ఆమెపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ప్రతి చిత్రంలోనూ వంద శాతం ఎఫర్ట్ పెట్టాల్సిన అవసరం ఉంది. సమంత లో ఒత్తిడి ఆమెలోని నటిని మరింత మెరుగుపరుస్తుందని ఆశించొచ్చు. –మా ఇంటి బంగారం– విజయం ఆమెకు ఒక పునాది మాత్రమే. ఈ పునాది మీద సమంత భవిష్యత్తును ఎలా నిర్మించుకుంటుంది అన్నదే అందరిలోనూ ఉన్న ఆసక్తి. ఆచితూచి వేసే ప్రతి అడుగు సమంతను మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# తప్పు జరిగిపోయింది.. బహిరంగంగా ఒప్పుకుంటూ క్షమాపణలు చెప్పిన పృథ్వీ!



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన తాజా చిత్రం 'ఐ నో బడి' తెలుగులో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. 'సలార్' సినిమాతో మన దగ్గర మంచి క్రేజ్ తెచ్చుకున్న పృథ్వీరాజ్, ఆ నమ్మకంతోనే ఈ సినిమాను నేరుగా తెలుగులో రిలీజ్ చేశారు. కానీ బ్రాండింగ్ లోపాలు, టైటిల్ కన్ఫ్యూజన్ వల్ల సినిమాకు థియేటర్లలో సరైన రెస్పాన్స్ రాలేదు. ఈ ప్రమోషన్ల ఫెయిల్యూర్స్‌పై పృథ్వీరాజ్ స్పందిస్తూ బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. టైటిల్ కన్ఫ్యూజన్ పెద్ద మైనస్: ఈ సినిమాకు జరిగిన పెద్ద పొరపాటు టైటిల్ విషయంలోనే. ప్రమోషన్ల సమయంలో అంతా 'ఐ నో బడి' అని ప్రచారం చేశారు. కానీ థియేటర్లలోకి వెళ్లి స్క్రీన్ మీద చూస్తే 'ఐ ఎవరూ లేరు' అని కనిపించింది. ఇక ఇంగ్లీష్‌ను తెలుగులోకి సరిగ్గా ట్రాన్స్‌లేట్ చేయకపోవడం వల్ల వచ్చిన ఈ తేడాతో ఆడియన్స్ పూర్తిగా కన్ఫ్యూజ్ అయిపోయారు. జీరో పబ్లిసిటీ ఎఫెక్ట్: హీరో పృథ్వీరాజ్ స్వయంగా హైదరాబాద్ వచ్చి ప్రెస్ మీట్ పెట్టినప్పటికీ, గ్రౌండ్ లెవెల్‌లో మాత్రం పబ్లిసిటీ అసలు జరగలేదు. సినిమా ఎప్పుడు రిలీజ్ అయిందో కూడా చాలామంది జనాలకు తెలియలేదు. ఇక ప్రమోషన్స్ ఇంత వీక్‌గా ఉండటంతో బాక్సాఫీస్ వద్ద కనీస ఓపెనింగ్స్ కూడా రాలేదు. థియేటర్ల దగ్గర జనాలు లేక బీసీ సెంటర్లలో కొన్ని చోట్ల షోలు కూడా క్యాన్సిల్ అయ్యాయి. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద 'లెనిన్' సినిమా హవా నడుస్తోంది. దీనికి తోడు ఇంగ్లీష్ డబ్బింగ్ మూవీ 'ఈవిల్ డెడ్ బర్న్', మరో డబ్బింగ్ సినిమా 'హృదయం మురళి' రేసులో ఉండటంతో 'ఐ నో బడి' కి థియేటర్లు దొరకడమే కష్టమైంది. పైగా మలయాళ కంటెంట్‌ను మన వాళ్లు ఓటీటీలో చూసేందుకే ఎక్కువ ఇష్టపడుతుండటంతో థియేటర్ల వైపు రాలేదు. తప్పు ఒప్పుకున్న పృథ్వీరాజ్: ఈ బ్రాండింగ్ తప్పులు, పబ్లిసిటీ ఫెయిల్యూర్స్ మీద హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. టైటిల్ ట్రాన్స్‌లేషన్ విషయంలో పెద్ద తప్పు జరిగిందని ఆయన ఓపెన్‌గా ఒప్పుకున్నారు. కేవలం ప్రెస్ మీట్ పెడితే సరిపోదని, గ్రౌండ్ లెవెల్ ప్రమోషన్స్ మిస్ అయ్యాయని చెప్తూ, ఈసారికి తనను క్షమించమని, నెక్స్ట్ టైమ్ ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటానని అభిమానులను కోరారు. ఒక మంచి సర్వైవల్ థ్రిల్లర్ కథతో వచ్చినప్పటికీ, కేవలం మార్కెటింగ్ లోపాల వల్లే ఈ సినిమా తెలుగులో వెనుకబడిపోయింది. ప్రస్తుతం 'వారణాసి' సినిమాలో విలన్‌గా నటిస్తూ తెలుగు మార్కెట్‌ను పెంచుకోవాలని చూస్తున్న పృథ్వీరాజ్.. ఈ సినిమా రిజల్ట్ నుంచి పాఠాలు నేర్చుకుని నెక్స్ట్ ప్రాజెక్ట్‌తో గట్టిగా కంబ్యాక్ ఇస్తారని ఆశిద్దాం..

# బాలీవుడ్ విలన్లతో బాలయ్య చేస్తున్న గ్లోబల్ బాక్సాఫీస్ ప్రయోగం ఇదేనా ?



టాలీవుడ్ సీనియర్ స్టార్స్ అనగానే ఒకప్పుడు కేవలం తెలుగు రాష్ట్రాల సరిహద్దులకే పరిమితమైన మార్కెట్ గుర్తుకొచ్చేది. కానీ, మారుతున్న నేటి పాన్-ఇండియా కాలంలో ఆ లెక్కలు పూర్తిగా మారుతున్నాయి. ముఖ్యంగా గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ తన సినిమాల్లో అనుసరిస్తున్న సరికొత్త కాస్టింగ్ స్ట్రాటజీ ఇప్పుడు ఇండస్ట్రీలో ఒక హాట్ ట్రెండ్‌గా మారింది. కేవలం లోకల్ విలన్లతో సరిపెట్టకుండా, బాలీవుడ్ అగ్రనటులను తన ప్రాజెక్టుల్లోకి దించుతుండటం వెనుక కేవలం ఒక కమర్షియల్ హంగు మాత్రమే లేదు... దీని వెనుక నార్త్ ఇండియా మార్కెట్‌ను సైలెంట్‌గా కొల్లగొట్టాలనే ఒక లోతైన ప్లాన్ దాగుంది అని టాక్‌ఆవిశేషాలు మీకోసం.. సాధారణంగా సౌత్ సినిమాలు నార్త్ బెల్ట్‌లో క్లిక్ అవ్వాలంటే భారీ విజువల్స్ లేదా మైథాలజీ సబ్జెక్టులు ఉండాలి అనుకుంటారు. కానీ బాలకృష్ణ రూట్ మార్చారు. 'భగవంత్ కేసరి' లో అర్జున్ రాంపాల్‌ను, మొన్నటి 'డాకు మహారాజ్' లో బాబీ డియోల్‌ను, ఇప్పుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'చీదీఖ111' లో సంజయ్ దత్‌ను విలన్లుగా పెట్టడం ద్వారా ఆయన హిందీ ఆడియన్స్‌కు నేరుగా కనెక్ట్ అవుతున్నారు. బాలీవుడ్ ప్రేక్షకులకు బాగా పరిచయమున్న ఈ స్టార్స్... బాలయ్య లాంటి పవర్‌ఫుల్ మాస్ హీరోతో తలపడుతుంటే చూసే క్రేజ్ నార్త్ మార్కెట్‌లో బిజినెస్ వాల్యూను, డిజిటల్ రైట్స్ ధరలను అమాంతం పెంచేస్తోంది. ఇక బాలకృష్ణ సినిమాలో విలన్ పాత్రలకు ఉండే వెయిటేజ్, వారి క్యారెక్టరైజేషన్లు చాలా బలంగా ఉండటం వల్లే అర్జున్ రాంపాల్, బాబీ డియోల్ లాంటి నటులు వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పుడు సంజయ్ దత్ కూడా అదే బాటలో నడుస్తున్నారు. దీనివల్ల బాలీవుడ్ స్టార్స్‌కు సౌత్‌లో కొత్త మార్కెట్ దొరుకుతుంటే... బాలయ్య సినిమాలకు నార్త్ ఇండియాలో థియేట్రికల్ రీచ్ పెరుగుతోంది. ఇరుపక్షాలకూ లాభం చేకూర్చే పక్కా ప్లాన్ అని సమాచారం. గతంలో బాలయ్య మార్క్ డైలాగులు, యాక్షన్ సీక్వెన్సులు కేవలం మన తెలుగు ఆడియన్స్‌కు మాత్రమే పూనకాలు తెప్పించేవి. కానీ బాలీవుడ్ విలన్ల ఎంట్రీతో హిందీ డబ్బింగ్ సర్క్యూట్స్‌లో కూడా బాలయ్య సినిమాలకు విపరీతమైన వ్యూయర్‌షిప్ వస్తోంది. హిందీ ఆడియన్స్ కూడా ఈ 'లైన్ వర్సెస్ బాబా' లాంటి క్రేజీ కాంబినేషన్లను ఓపెన్‌గా యాక్సెప్ట్ చేస్తున్నారు అన్నది నిజం.

## ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

మొదటిపేజీ తరువాయి

సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మి÷-లలెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను ఈ సమావేశంలో సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునేవిధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధరంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం వంటి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాభావ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాల్సిందిగా సూచించారు. శాస్త్రీయ విధానాలతో ఎల్-నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి రాష్ట్రంలో విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళిక, పొలంలోనే నేల తేమ సంరక్షణ చర్యలు, పంటల వైవిధ్యీకరణ వంటి శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని ఆదేశించారు. వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై మండలాల వారీగా వారపు బులెటిన్ విడుదల చేయనున్నారు. ఎల్-నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలంటే వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని మంత్రి తుమ్మల అన్నారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో ప్రతి వారం మండలాల వారీగా సమగ్ర వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితి, రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలతో పాటు నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఈ నెల, వచ్చే నెలకు సంబంధించిన వాతావరణ అంచనాలను విశ్లేషించి, ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఖచ్చితమైన అంచనాలను కూడా బులెటిన్‌లో పొందుపరచాలని మంత్రి స్పష్టం చేశారు. ఇక్రిశాట్‌లో జరిగిన సమీక్షలో శాస్త్రవేత్తలు వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభమవడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక సూచనలు చేశారు. మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను ముందుగానే సమీకరించామని, మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినో ప్రభావాలు, ప్రత్యామ్నాయ సాగు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులు, శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ప్రతి రైతు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో మార్గనిర్దేశర చేస్తారని చెప్పారు.

## విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను పెంచుతున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## జాడలేని వర్షాలు...ముఖం చాటేసిన మబ్బులు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## స్వలాభం కోసం కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి

కలెక్షన్లు చేసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రక్తదాహం, ధనదాహం, అధికార దాహం ఉందని విమర్శించారు. అందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇంటికి పరిమితం చేశారన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఎంపీ తెలిపారు. తెచ్చింది కాంగ్రెస్ నేతలన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాలకు బీఆర్ఎస్ కారణమైందని అంటూ ఆరోపించారు. పిట్ట కథలు చెప్పి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. కమిషన్లు దండుకోవడం తప్ప ఎకరానికి కూడా కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. 'పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సెటైర్ విసిరారు. 2009లో కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటే అని.. ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించింది బీఆర్ఎస్ అంటూ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు గుప్పించారు. అందుకే బిజెపి ఎంపి ఇప్పుడు మళ్లీ బిఆర్ఎస్ గొంతుతో మాట్లాడుతున్నారని అన్నారు. కాళేశ్వరం పేరుతో నిధులు దండుకున్న వీరు మళ్లీ దానిగురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు.

## సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్, కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక్.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌పై మాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలు, సింగరేణిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే సంస్థ పరిస్థితి దిగజారడానికి దారితీసిందని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలను చెల్లించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.24 వేల కోట్ల అప్పు మిగిల్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో 49 శాతం వాటా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధి కోసం కేంద్రాన్ని సమర్థవంతంగా సంప్రదించలేదని, ఈ రెండు పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## టీజీటెట్-జూన్ 2026 ఫలితాల విడుదల

మొదటిపేజీ తరువాయి

మంది దరఖాస్తు చేసుకోగా, 1,15,028 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 50,544 మంది అర్హత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత శాతం 43.94గా నమోదైంది. పేపర్-1లో ఉత్తీర్ణత శాతం 65.29గా ఉండగా, పేపర్-2 (మ్యాథ్స్ అండ్ సైన్స్)లో 40.76 శాతం, పేపర్-2 (సోషల్ స్టడీస్)లో 25.79 శాతం అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్ నోటిఫికేషన్‌ను జూలై 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఆ పరీక్షలు సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు సీబీటీ విధానంలో నిర్వహించబడతాయి. ఇకపై ప్రతి సంవత్సరం మొత్తం నాలుగు టెట్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో రెండు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు, మరో రెండు సాధారణ అభ్యర్థులకు కేటాయించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్ నోటిఫికేషన్ జూలై 21న విడుదల కానుంది. ఈ పరీక్షలు సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు సీబీటీ విధానంలో నిర్వహించబడతాయి.

## సింగరేణి అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రజా ప్రభుత్వం ప్గత్యేక చొరవతో తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంలో భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు. విజ్ఞప్తులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ ,గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ తెలిపారు.

## కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

మొదటిపేజీ తరువాయి

ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

మొదటిపేజీ తరువాయి

ఎద్దేవా చేశారు. గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ముకుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రశ్నించడం వల్లే ప్రభుత్వం దిగివచ్చి దేవాదుల మోటర్లను ఆన్ చేసిందని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే అక్కడ కూడా 2500 క్యూసెక్కుల నీటిని ఎత్తాల్సి ఉండగా, కేవలం 6 మోటర్లను మాత్రమే నడుపుతున్నారని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీలో నీరు నిల్వ చేసుకుంటే పంపింగ్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాలా ముద్దుగా చెబుతున్నారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసలు ఆ సమ్మక్క బ్యారేజీని నిర్మించింది ఎవరో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని, కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా చేతకాక కాంగ్రెస్ నేతలు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

## నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి

చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహం అతని మేనమామ ఊరు కొత్తూరు మండలం పంజర్లలో లభ్యమైనట్లు చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు సమీపంలోని ఓ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ మృతదేహం రాజ్‌కుమార్‌దేనని డీసీపీ ధ్రువీకరించారు. రాజ్‌కుమార్ పాయిజన్ సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని డీసీపీ పేర్కొన్నారు. ఘటనాస్థలిలో పాయిజన్ బాటిల్ లభ్యమైందని తెలిపారు. ఆ ఆధారాలను సేకరించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాగా, షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా, ఈరోజు అతడి మృతదేహం లభ్యమైంది. సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌కు సంబంధించిన పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జూన్ 12న పోక్సో కేసులో కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో అతడు కోర్టులో చేసిన వాదనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. బెయిల్ విచారణ సందర్భంగా.. తనపై నమోదైన పోక్సో కేసు తప్పుడు కేసు అని రాజ్‌కుమార్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. బాధిత బాలిక తండ్రి తన వద్ద అప్పు చేశాడని, ఆ డబ్బులు తిరిగి అడిగినందుకే తనపై కేసు పెట్టారని వాదించాడు. ఫిర్యాదు చేసిన రోజు తాను అక్కడే లేనని, ఆ సమయంలో భార్యతో కలిసి ఆస్పత్రికి వెళ్లినట్లు కోర్టులో తెలిపాడు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికకు సంబంధించిన కేసు నమోదైన తర్వాత రాజ్‌కుమార్ కుటుంబంలో విభేదాలు మరింత పెరిగాయి. ఈ వ్యవహారం తర్వాత అతడి భార్య సరిత విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే విషయంపై రాజ్‌కుమార్ తీవ్ర ఆగ్రహానికి గురై, పలుమార్లు సరితను చంపేస్తానని బెదిరించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. హత్యలకు ముందు రాజ్‌కుమార్ సాధారణంగానే వ్యవహరించినట్లు గుర్తించారు. ఘటనకు కొన్ని గంటల ముందు తన కుమారుడితో కలిసి బయటకు వెళ్లి ఆడించడంతో పాటు హెయిర్ కటింగ్ కూడా చేయించినట్లు సమాచారం. అదే రోజు ఉత్సాహంగా ఇంటికి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఏఐ వినియోగంతో బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

**- భద్రాద్రి జిల్లా జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి**

**-పాల్వంచలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల స్పెల్-2 శిక్షణా తరగతుల పరిశీలన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూలై 13 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుని ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్పెల్-2 శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆమె సందర్శించి శిక్షణ తీరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రతి తరగతికి నిర్దేశించిన లెర్నింగ్ అవుట్‌కమ్‌లను విద్యార్థులు తప్పనిసరిగా సాధించేలా బోధన సాగించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం ద్వారా జిల్లా పెర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండెక్స్ ర్యాంకును కూడా మెరుగుపరచవచ్చని తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యాబోధనలో భాగం చేయడం కాలానుగుణ అవసరమని పేర్కొన్న ఆమె, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పాఠ్యబోధనలో వినియోగించడం ద్వారా బోధనను మరింత ప్రభావవంతంగా మార్చవచ్చన్నారు. విద్యార్థులకు కూడా ఏఐపై ప్రాథమిక అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పాఠ్యాంశాలను సాధ్యమైనంత వరకు ఇంగ్లీష్‌లోనే బోధించడం ద్వారా వారి స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంపొందించాలని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా బోధనా విధానాలు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాధవరావు, విద్యాశాఖ అధికారులు, శిక్షణ నిర్వాహకులు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




నిర్మల్ జూలై 13 : సంవత్సరం వయస్సు నుండి నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు నశించి, రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం విధిగా మాత్రలను తీసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనారోగ్యానికి గురికాకుండా ఉండేలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీఈవో భోజన్న, ఇమ్యూనైజేషన్ అధికారి నయనా రెడ్డి, అధికారులు రవీందర్, ప్రిన్సిపల్స్ డానియల్, తదితరులు పాల్గొన్నారు.

# 25,వ వార్డులో అభివృద్ధి పనులకు భూమి పూజ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోరుట్ల, జూలై 13 : కోరుట్ల పట్టణంలోని 25,వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ సోమవారం వార్డు కౌన్సిలర్ కలాల రాధ సాయిచంద్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రూ. 06 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అంతర్గత రహదారి నిర్మాణ పనులకు చైర్పర్సన్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన బోరుబావిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ కలాల రాధ సాయిచంద్, డిడిఈ అరుణ్ కుమార్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను స్వయంగా స్వీకరించిన కలెక్టర్ భవేష్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్ జూలై 13 : ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై... వెంకటేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, జూలై 13 : ములుగు పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా నియమితులైన ఎస్. వెంకటేష్ సోమవారం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ తో పాటు,నేరస్తులతో కఠిన వైఖరి ప్రదర్శించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని,ఉత్తమ పోలీసింగ్ అమలు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజాభద్రతకు అంకితభావంతో పనిచేస్తానని, ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో సమాజానికి సవాలుగా మారుతున్న మాదకద్రవ్యాల నియంత్రణ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తానని ఎస్ హెచ్ ఓ ఎస్.వెంకటేష్ అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తానని,జిల్లా ఎస్పీ తనపై ఉంచిన నమ్మకానికి ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



# వైటీపీఎస్ ప్రైవేటీకరణ ప్రతిపాదనకు వ్యతిరేకంగా కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూలై 13 : యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1, స్టేజ్-2లోని యాష్ ప్లాంట్, కోల్ ప్లాంట్‌ల ప్రైవేటీకరణ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం మణుగూరులోని బీటీపీఎస్ ప్రధాన గేటు ఎదుట విద్యుత్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించిన ఉద్యోగులు విద్యుత్ యాజమాన్యం వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ బీటీపీఎస్ రీజినల్ కన్వీనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వైటీపీఎస్ పాక్షిక ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగుతుందని, సెంట్రల్ కమిటీ నిర్ణయాల మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. గత 19 రోజులుగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నప్పటికీ జెన్కో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని, అందుకు ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నిరసనలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి నరేష్, నాయకులు మహేష్, కార్మిక సంఘం-1535 అధ్యక్షుడు వి. ప్రసాద్, కార్మిక సంఘం-327 ప్రాంతీయ ప్రధాన కార్యదర్శి పి. సాంబ, టీఆర్‌వీకేఎస్ నాయకుడు డి. సతీష్, ఏఐటీయూసీ నాయకుడు శోభన్, ఎస్సీ--ఎస్టీ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.




# కలం మాత్రమే కాదు... కరుణ కూడా జర్నలిస్టుల ధర్మం

**జిల్లా అధ్యక్షులు అరుగులపోశెట్టి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్ జూలై 13 : తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ వృద్ధ ఆశ్రమాలలో పండ్లు పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా (ఀజేూ) అధ్యక్షులు అరుగుల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి మరాజు గంగాధర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సమాజ సేవకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ఇటువంటి మానవతా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. జర్నలిస్టులు వార్తలను అందించడమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో సమాజానికి అండగా నిలవడం కూడా తమ బాధ్యతేనని పేర్కొన్నారు. అలాగే నిర్మల్ జిల్లా జర్నలిస్టుల శ్రేయస్సు కోసం సేవ చేసే అవకాశం కల్పించిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు ఉప్పల లక్ష్మణ్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) సభ్యులు ఫిరోజ్ ఖాన్, అక్రిడిటేషన్ కమిటీ బాధ్యులు ఎలుగు లింగన్న, రాజేందర్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆహ్మద్ ఇంతియాజ్ అలీ , కార్యదర్శి కె రాజ గౌడ్, ఈ సి మెంబర్ ఎండి ఇసాక్ అలీ వృద్ధ ఆశ్రమా ఇంచార్జి గడ్డం రాము, పాల్గొన్నారు.




Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com